

బీహార్ ఎన్నికల ఫలితాలు

ఎన్‌డిఎ	202
మహాగట్బంధన్	35
ఇతరులు	6
మొత్తం	243

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 104 | విజయవాడ, శనివారం 15 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 16 November 2025 | Rs



సఫారీ ధమాల్

- తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్
- ఐదు వికెట్లతో రాణించిన బుమ్రా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 37/1
- ఈడెన్ గార్డెన్స్ టెస్టు తొలి రోజు

8

మళ్లీ ఎన్‌డిఎ

బీహార్‌లో కొనసాగిన నితీష్ హవా

ప్రజాశక్తి - యంత్రాంగం

బీహార్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అధికార బిజెడి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి మళ్లీ విజయం సాధించింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ హవా కొనసాగింది. ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్ష మహాగట్బంధన్‌కు ఈ ఎన్నికల్లోనూ ఎదురుదెబ్బ తగిలింది. 243 అసెంబ్లీ నియోజకవర్గాలున్న బీహార్ శాసనసభకు రెండు దశల్లో పోలింగ్ నిర్వహించగా..శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు విడుదల చేశారు. కడపటి సమాచారం ప్రకారం.. ఎన్‌డిఎ కూటమిలో బిజెపి 90 స్థానాల్లోనూ, జెడియు 85, ఎల్‌జెపి (ఆర్‌వి) 19, హెఎఎం (ఎస్) 5, ఆర్‌ఎల్‌ఎం 4 స్థానాల్లోనూ గెలుపొందాయి. మహాగట్బంధన్‌లో ఆర్‌జెడి 24, కాంగ్రెస్ 6, సిపిఎం 1, సిపిఐ (ఎంఎల్) 2 స్థానాల్లో విజయం సాధించాయి. ప్రతిపక్షాల ఓట్ల చీలికలో కీలక భూమిక పోషించిన ఎంఐఎం 5 స్థానాల్లో గెలుపొందింది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఖాతా తెరవలేకపోయినప్పటికీ ప్రతిపక్ష పార్టీల ఓట్లను గణనీయంగా చీల్చింది. కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ చుట్టూ వివాదాలు సమసిపోని నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. సరిగ్గా ఎన్నికలకు కొద్ది రోజుల ముందుగా మహిళల సాధికారత పేరుతో 21 లక్షల మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయానికి ప్రధానకారణంగా భావిస్తున్నారు. దీనికితోడు ధన ప్రవాహం, అధికారయంత్రాంగ దుర్వినియోగం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌తో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాల అధినాయకత్వం బీహార్‌లోనే తిష్టవేసి ప్రచారం నిర్వహించడం కాషాయ కూటమి విజయానికి బాటలేశాయి. ఎస్‌ఐఆర్‌పైనా, ఎన్నికల ముందు నగదు తాయిళాలపైనా, బిజెపి సాగిస్తున్న విద్వేష ప్రచారంపైనా తన శక్తి మేరా పోరుసాగించినప్పటికీ ఆర్‌జెడి నేతృత్వంలోని మహాగట్బంధన్ ఆశించిన రీతిలో విజయం సాధించలేకపోయింది. ఈ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ,

మిగతా 7లో



పాట్నాలోని బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న జెడియు, బిజెపి కార్యకర్తలు

బిభూతిపుర్‌లో సిపిఎం విజయం


బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌డిఎ హవా కొనసాగినప్పటికీ సమస్తిపుర్ జిల్లాలోని బిభూతిపుర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జయకేతనం ఎగురవేసింది. మహాగట్బంధన్ మద్దతుతో బరిలోకి దిగిన సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్ తన సమీప ప్రత్యర్థి జెడియు అభ్యర్థి రవినా కుష్వాహాపై 10281 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. అజయ్ కుమార్‌కు 79246 ఓట్లు వచ్చాయి. రవినాకు 68965 ఓట్లు పోలయ్యాయి. ఇదే స్థానంలో జన్‌సురాజ్ పార్టీకి 13,450 ఓట్లు వచ్చాయి. కాగా సిపిఐ(ఎంఎల్-లిబరేషన్) రెండు స్థానాల్లో (పాలిగంజ్, కరకత్)లో విజయం సాధించింది.



అజయ్ కుమార్



సదస్సులో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, వేదికపై సిఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు, వివిధ సంస్థల ప్రతినిధులు



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన

- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్
- దేశానికి గేట్‌వేలా విశాఖ : చంద్రబాబు
- ఉత్సాహంగా ప్రారంభమైన సిఐఐ భాగస్వామ్య సదస్సు

విశాఖపట్నం నుండి పటౌడి

సంపదను సృష్టిస్తేనే పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యమవుతుందని భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ అన్నారు. విశాఖపట్నంలో శుక్రవారం ప్రారంభమైన సిఐఐ భాగస్వామ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వివిధ దేశాల నుండి వచ్చిన పలు సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తున్నాయని చెప్పారు. జిఎస్‌టి సంస్కరణలు, మౌళిక వసతుల కల్పన, వివిధ రంగాల్లో పెట్టుబడులు వంటి అంశాల్లో కృషి జరుగుతోందన్నారు. ఇ-గవర్నెన్స్, డిజిటల్ ఇన్‌ప్రా ద్వారా వేగంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. దేశంతోపాటు, రాష్ట్రంలోనూ పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమన్నారు. అభివృద్ధికి చంద్రబాబు రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారని ప్రశంసించారు. రానున్న రెండు మూడేళ్లలో భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం దేశానికి గేట్‌వేలాగా మారుతోందని చెప్పారు. ఇటీవలే విశాఖను కేంద్ర ప్రభుత్వం సురక్షితమైన నగరంగా ప్రకటించిందని తెలిపారు. పెట్టుబడిదారుల లక్ష్యంగా రాష్ట్రం ఎదుగుతోందని, రాష్ట్రంలో విశాఖ పెట్టుబడులకు కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. పారిశ్రామిక వేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఇస్తోందని, దీనికోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలను ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈ ప్రోత్సాహకాలకు సావరీన్ గ్యారంటీ కూడా ఇస్తామన్నారు. ఈ పెట్టుబడుల సదస్సుకు 72 దేశాల నుండి 500 మంది విదేశీ ప్రతినిధులు వచ్చారని తెలిపారు. 2,500 మంది పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు కూడా సదస్సుకు వచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్, సెమీ కండకర్లు, డిఫెన్స్ వంటి రంగాల్లో అనేక పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు, త్వరలో డ్రోన్ టాక్సీలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. పర్యాటకాన్ని ఒక ఇజంగా మారుస్తున్నామని, ఈ రంగంలో పెట్టుబడులు గణనీయంగా రావాల్సి ఉంటుందని తెలిపారు. 17 నెలల కాలంలోనే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, దీనివల్ల 20 లక్షల మందికి ఉద్యోగాలు కూడా లభిస్తాయన్నారు. వచ్చే పదేళ్ల కాలంలో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయన్న నమ్మకంగా ఉన్నట్లు చెప్పారు.

పెట్టుబడుల కోసం పారదర్శక విధానం : కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ గ్లోబల్ ట్రేడ్ గేట్‌వేగా

మిగతా 7లో

మహాగట్బంధన్‌కు ఎదురుదెబ్బ

- మతోన్మాద, కులతత్వ విద్వేషాలతో ప్రజల్లో చీలిక తెచ్చిన ఎన్‌డిఎ
- బీహార్ ఫలితాలపై సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం సాధించడం మహాగట్బంధన్‌కు ఎదురు దెబ్బ అని సిపిఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. పాలక సంకీర్ణ కూటమి (ఎన్‌డిఎ) మొత్తంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని, అనేక రకాలుగా అవకతవకలకు పాల్పడుతూ, పెద్ద మొత్తంలో డబ్బును వెదజల్లిందని విమర్శించింది. ప్రధానమంత్రి, హోంమంత్రితో సహ ఎన్‌డిఎ నేతలు మతోన్మాద, కులతత్వ విద్వేషాలతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి సమీకరణ ఎత్తుగడల ద్వారా ఎన్‌డిఎ లబ్ది పొందిందని వ్యాఖ్యానించింది. దుర్మార్గమైన ఈ ఎత్తుగడకు కార్పొరేట్ మీడియా మరింతగా పెంచి పోషించి..మహాగట్బంధన్ లేవనెత్తిన ప్రజా సమస్యలను నీరుగార్చిందని పేర్కొంది.

బిజెపిని ఓడించడానికి ప్రతిపక్ష పార్టీలు మరింత సమైక్యంగా కృషి చేసి వుండాల్సిందని బీహార్ ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ ఫలితాల వెనుక గల ఇతర కారణాలను సిపిఎం మరింత సవివరంగా సమీక్షిస్తుందని తెలిపింది. సిపిఎం అభ్యర్థులకు, ఇతర ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ఓటు వేసిన ప్రజలందరికీ పొలిట్‌బ్యూరో కృతజ్ఞతలు తెలియచేసింది. అణచివేతకు, దోపిడీకి గురవుతున్న ప్రజల హక్కుల కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం హామీ ఇచ్చింది.

ధాన్యం దళారుల భోజ్యం

- కఠిన నిబంధనలతో అన్నదాతకు కష్టాలు
- కానరాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

3



మరో అప్పు

- రాజధాని కోసం మొత్తం రూ.40 వేల కోట్లు

3

ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులపై ఏదీ?

- నేటికీ అందని రూ.కోట్ల పరిహారం
- నిర్మాణ పనులు మాత్రం 91.70 శాతం పూర్తి

3

జూబ్లీ 'హస్తా'నిదే

- ఉప పోరులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం
- డిపాజిట్ కోల్పోయిన బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి మాగంటి సునీత (బిఆర్‌ఎస్)పై 24,729 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం పది రౌండ్ల లెక్కింపు ముగిసేసరికి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికలో బిజెపికి భంగపాటు తప్పలేదు. కేంద్ర మంత్రులు ప్రచారం చేసినా కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు మాత్రమే వచ్చాయి. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్‌ను దక్కించుకునేందుకు ఆ పార్టీ తీవ్రంగానే శ్రమించింది. ఎంఐఎం మద్దతుతో బరిలోకి దిగిన కాంగ్రెస్ వైపే ఓటర్లు మొగ్గు చూపారు. ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలతో పాటు పలు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీపడ్డారు. మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉండటం గమనార్హం. నోటాకు 1,863 ఓట్లు పోలయ్యాయి. ఫలితాల వెల్లడి అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ విలేకరులతో మాట్లాడారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోందని వివరించారు. బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలని సూచించారు. మరో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని సిఎం ధీమా వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ ఫలితాలపై ఎమ్మెల్సీ కవిత ఆశక్తికర ట్వీట్ చేశారు. కర్మ హిట్స్ బ్యాక్ అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు చేశారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు.



గాంధీభవన్ వద్ద సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

గుండెపోటుతో ఇండిపెండెంట్ అభ్యర్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కౌంటింగ్ వేళ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఒకరు గుండెపోటుతో మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఎర్రగడ్డలో నివాసముంటున్న అన్వర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశాడు. శుక్రవారం ఉదయం ఆయన తన నివాసంలో తీవ్ర ఛాతి నొప్పితో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అన్వర్ ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాజకీయ పార్టీలు సంతాపం వ్యక్తం చేశాయి. ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఒత్తిడి, ఆందోళనే ఆయన మరణానికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు.

అంగన్‌వాడీలకు మెమోలు

- 130 మందికి జారీ

పెనుమంత్ర : అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఉదయం తెరిచిన ఫొటోలు యాప్‌లో ఆలస్యంగా అప్‌లోడ్ చేశారనే కారణంగా పెనుమంత్ర సిడిపిఒ ప్రాజెక్టు పరిధిలోని 130 మంది అంగన్‌వాడీలకు మెమోలు జారీ చేశారు. ఆ మెమోలను శుక్రవారం రాత్రిలోపు తీసుకోవాలని ఆదేశించడంతో అంగన్‌వాడీలంతా శుక్రవారం సాయంత్రం నానా అవస్థలు పడుతూ సిడిపిఒ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ మెమోలు తీసుకుని, సంబంధిత సంతకాలు పెట్టాక ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు, ఆటోలు లేక రాత్రి ఎనిమిది గంటలకు సైతం ఆ ప్రాంతంలోనే రోడ్లపై అంగన్‌వాడీ కార్యకర్తలు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకుని సిఐటియు నేత కూసంపూడి సుబ్బరాజు అక్కడికి చేరుకుని చేరుకుని అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఫొటోలు అప్‌లోడ్‌లో కొన్ని నిమిషాలు ఆలస్యమైందనే పేరుతో మెమోలు ఇవ్వడం సరికాదని, అంగన్‌వాడీలు రాత్రి వేళ ఇళ్లకు ఎలా వెళ్తారని, మార్గమధ్యంలో ఏమైనా జరిగితే ఐసిడిఎస్ అధికారులు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు.

రైతాంగంపై 'సీడ్‌బాంబ్'

- ముసాయిదా బిల్లును వెబ్‌సైట్‌లో పెట్టిన కేంద్రం
- మూడు వ్యవసాయ నల్లచట్టాల అమలుకు దొడ్డితోవ
- బీహార్‌లో విజయం సాధించగానే వెలుగులోకి
- అభ్యంతరాల సమర్పణకు డిసెంబర్ 11 వరకు గడువు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం దేశ రైతాంగంపై 'విత్తన బాంబు' వేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ కూటమి విజయం సాధించగానే, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను మళ్లీ ముందుకు తెచ్చింది. 'డ్రాఫ్ట్ సీడ్ బిల్-2025' పేరుతో మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ వెబ్‌సైట్‌లో ఈనెల 13వ తేదీ రాత్రి అప్‌లోడ్ చేసిన ఈ బిల్లు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత వెలుగులోకి వచ్చింది. అయితే నేరుగా ఈ బిల్లు ఆ వెబ్‌సైట్‌లో ఓపెన్ కావట్లేదు. పిఐబికి చెందిన వెబ్‌సైట్ లింక్ ద్వారానే ఓపెన్ అవుతోంది. ఈ బిల్లుపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలను డిసెంబర్ 11వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా తెలపాలని పేర్కొంది. భారతదేశ రైతాంగం సుదీర్ఘకాలంగా ఏ విధానాలకు వ్యతిరేకంగా అయితే పోరాడుతోందో, అవే అంశాలను ఈ బిల్లులో పొందుపర్చారు.

డ్రాఫ్ట్ సీడ్ బిల్ - 2025" బిల్లుతో రైతాంగానికి కష్టాలిలా...

- ఈ బిల్లులో విత్తన ధరల నియంత్రణ స్పష్టంగా లేదు. దీనివల్ల కంపెనీలు అధిక ధరలకు విత్తనాలు విక్రయించే అవకాశం ఉంది. రైతులపై ఆర్థిక భారాలు పెరుగుతాయి. విత్తన మార్కెట్‌లో గుత్తాధిపత్యం ఏర్పడే ప్రమాదం ఉంది.



- కంపెనీలు సమర్పించే ఫీల్డ్ ట్రయల్ డేటా, మొలక దిగుబడి ప్రమాణాలు వంటివన్నీ ఆయా సంస్థలే అందిస్తాయి. అధికారుల పర్యవేక్షణ తక్కువైతే తప్పుడు డేటా, ఒత్తిడితో ఇచ్చే ల్యాబ్ సర్టిఫికెట్లు, "సూపర్ హై యీల్డ్" అనే పేరుతో రైతులను తప్పుదోవ పట్టించడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- పరిహారం పొందే ప్రక్రియను క్లిష్టంగా రూపొందించారు. బిల్లు రైతుకు పరిహారం హక్కు ఇస్తున్నా, నమూనాలు సేకరణ, ప్రయోగశాల పరీక్షలు, విచారణ, కంపెనీతో నోటీసుల మార్పిడి వంటి పద్ధతులు సుదీర్ఘంగా, సాంకేతికంగా క్లిష్టతరమై పూర్తిగా అధికారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. దీనివల్ల రైతులు సమయానికి పరిహారం పొందలేరు.
- రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రయివేటు కంపెనీలకు అనుకూలంగా మారుతుంది. రిజిస్ట్రేషన్ ప్రమాణాలు, ల్యాబ్ టెస్టింగ్, గణాంకాలు, క్లినికల్ డేటా, రెండు సీజన్ ట్రయల్స్ వంటి అంశాలన్నీ పెద్ద కంపెనీలు, కార్పొరేట్లకు పూర్తిగా అనుకూలం. చిన్న విత్తన ఉత్పత్తిదారులు ఈ భారాన్ని మోయలేరు. ఫలితంగా బహుళజాతి కంపెనీలు మార్కెట్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తాయి. చివరకు రైతులు తమకు ఏం కావాలో ఎంపిక చేసుకొనే పరిస్థితుల్ని కోల్పోవాల్సి వస్తుంది.
- భవిష్యత్‌లో కొత్త జాతులపై ఐపిఆర్ హక్కులు, ప్రయివేటు కంపెనీల రాయల్టీలు, బయోటెక్ కంపెనీలకే పరిమితమై, రైతుల స్వీయ విత్తన ఉత్పత్తిపై పరోక్ష ప్రభావాన్ని చూపుతాయి.
- ట్రేసబిలిటీ వ్యవస్థ చిన్న రైతులకు భారమౌతుంది. డిజిటల్ ట్రేసింగ్, క్యూఆర్ కోడ్, టెక్ ఆధారిత ప్రమాణాలను ఈ చట్టం ప్రవేశపెడుతుంది. పెద్ద రైతులు, కంపెనీలకు ఇవి అనుకూలంగా ఉంటాయి. కానీ, చిన్న రైతులకు భారమవుతుంది. డిజిటల్ అవగాహన తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ వ్యవస్థ అమలు అడ్డంకిగా మారవచ్చు.
- దిగుమతి విత్తనాల పెరుగుదల దేశీయ విత్తన ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. పైకి కఠిన నిబంధనలున్నా, దిగుమతి మార్గాలు తెరవడం వల్ల విదేశీ విత్తన మల్టీనేషనల్ కంపెనీలు మార్కెట్‌లోకి పెద్ద మొత్తంలో ప్రవేశిస్తాయి. భారతీయ విత్తన కార్పొరేషన్లు, స్వదేశీ కంపెనీలు పోటీ కోల్పోతాయి. బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యం పెరిగి రైతులు వారిపై ఆధారపడే పరిస్థితులు ఏర్పడతాయి.
- విత్తనాల లైసెన్సింగ్ నిర్ధారణ అవినీతికి ఆజ్యం పోస్తుంది. ఈ చట్టం ప్రకారం అధికారులకు పెద్ద అధికారాలే ఇచ్చారు. నమూనాల సేకరణ, నిల్వ సీజ్, గిడ్డంగుల తనిఖీ, కేసుల నమోదు వంటి అంశాల్లో అధికారుల విచక్షణ మేరకు వ్యవహరిస్తారు. ఫలితంగా అధికార పక్షపాతం జరిగితే రైతు న్యాయం పొందడం సంక్లిష్టమవుతుంది.

బిల్లులోని మరికొన్ని అంశాలివే..

- దేశంలోని విత్తనాల ఉత్పత్తి, ప్రామాణీకరణ, నిల్వ, పంపిణీ, రైతు రక్షణ వంటి వ్యవస్థలను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ సీడ్ బిల్-2025 ప్రకటించింది. 1966లో అమల్లోకి వచ్చిన పాత సీడ్స్ యాక్ట్ స్థానంలో, కొత్త సాంకేతికతలు, అధిక దిగుబడి జాతులు, బయోసేఫ్టీ ప్రమాణాలు, రైతు పరిరక్షణ హక్కులను ప్రతిబింబించే విధంగా చట్టాన్ని తెచ్చేదిశగా దీన్ని రూపొందించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.
- దేశవ్యాప్తంగా విక్రయించే అన్ని

మిగతా 5లో

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఎపి

- జనవరిలో క్వాంటం వ్యాలీ ప్రారంభం
- త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు
- ప్రాజెక్టులకు కేంద్రం సాయం అవసరం
- డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



ఎపి పెవిలియన్‌లోని స్టాల్స్‌ను పరిశీలిస్తున్న లోకేష్, రామ్మోహన్ నాయుడు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ వేడుకలో భాగంగా శుక్రవారం డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, సిఎస్ కె.విజయానంద్, రాష్ట్ర మంత్రులు టిజి.భరత్, బిసి.జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఎస్.సోమనాథ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం సాయం చేస్తే మరింతలా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకురానున్నామని, అందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ... డ్రోన్ల వినియోగం పెరిగిందని, దీనిని ఊహించి డ్రోన్ సిటీని ఎపి రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకోవడంతో మంచి పరిణామమని అభినందించారు.

ఐటికి గుర్తింపు లేని సమయంలోనే భవిష్యత్‌ను ఊహించి ఐటి అవకాశాలను సిఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని, ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఎఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు ముందంజలో ఉన్నారని కొనియాడారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం కానుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు ఉంటాయన్నారు. ఆర్‌అండ్‌డి రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం ఉంటుందని, దీనిలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్ - సర్టిఫికేషన్ సెంటర్లు, 25 వేల మంది రిమోట్ పైలట్‌లకు శిక్షణ వంటివి ఉంటాయన్నారు. డ్రోన్ సిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేలకుపైగా ఉద్యోగావకాశాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు సాధ్యమవుతాయని వివరించారు. శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారి ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



డ్రోన్ సిటీని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు, చిత్రంలో కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు తదితరులు

ఈ సిటీస్‌తో భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్‌కు ప్రాధాన్యం ఉంటుందన్నారు. స్పేస్ సిటీలో పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు, 35 వేలకు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఎపి స్పేస్ పాలసీ 4.0లో భాగంగా స్పేస్ టెక్ ఫండ్ కింద రూ.100 కోట్ల కేటాయింపు ఉంటుందన్నారు. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో భారత వైమానిక, అంతరిక్ష రంగాల్లో కొత్త శకం ఆరంభం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఒయు కుదుర్చుకున్నామన్నారు. డ్రోన్ సిటీకి సంబంధించి అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలతో అవగాహనా ఒప్పందం కుదిరిందని తెలిపారు. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో టెక్నాలజీ, నైపుణ్యాలు, పరిశ్రమల విస్తరణకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు.

పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయం

- సిఐఐ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ లక్ష్యమిదే..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు-2025లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపి పెవిలియన్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పెట్టుబడిదారులను రాష్ట్రం వైపు ఆకర్షించడమే ధ్యేయంగా దీన్ని తీర్చిదిద్దారు. డిజైన్, థీమ్ రాష్ట్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్-2047' లక్ష్యానికి అనుగుణంగా ఉంది. ఎపి పారిశ్రామిక సామర్థ్యం, పర్యావరణ అనుకూల విధానాలు, భవిష్యత్ ప్రణాళికలను తెలియజేస్తూ దీన్ని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. ఈ పెవిలియన్ ప్రధానంగా రాష్ట్రంలో ఉన్న కీలక రంగాలైన గ్రీన్ ఎనర్జీ, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, అంతరిక్షం, రక్షణ, పర్యాటక రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను సూచిస్తోంది. రాష్ట్రంలో ఎఐ వినియోగం, ప్రతిపాదిత డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల వివరాలను సాంకేతికత ద్వారా ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడికి అనుకూలమైన వాతావరణం, సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్, పారిశ్రామిక అభివృద్ధికి అందుబాటులో ఉన్న 'ప్లగ్-అండ్-ప్లే' మౌలిక సదుపాయాలను పెవిలియన్‌లో వివరించారు.

కీలక స్టాల్స్ ఇవే


పెవిలియన్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. క్వాంటం సిటీ, సిఆర్‌డిఎ - అమరావతి పెవిలియన్, ఇంధన శాఖ గ్రీన్ హైడ్రోజన్ హబ్, పరిశ్రమల శాఖ ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్, ఎపి పర్యాటక శాఖ స్టాల్స్ ఇక్కడ కొలువుదీరాయి. పెవిలియన్ ప్రారంభం సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పెట్టుబడిదారులకు అనుకూలమైన గమ్యస్థానంగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. పెవిలియన్ ప్రారంభం సందర్భంగా విజయవాడ-సింగపూర్ మధ్య నేరుగా విమాన సర్వీసుల ఏర్పాటుకు సంబంధించిన కీలక ఒప్పందం కుదిరిందని తెలిపారు.

లులూ గ్రూప్‌తో ఎంఒయు

రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు సంబంధించి లులూ ఇంటర్నేషనల్ గ్రూప్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అందుకు సంబంధించి సిఎం నారా చంద్రబాబు నాయుడు, లులూ గ్రూప్ చైర్మన్, ఎమ్‌డి యుసుఫ్ అలీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ సంస్థ ప్రతినిధులు అంగీకార పత్రాలు మార్చుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ... గత పాలకులు నిలిపేసిన ఈ ప్రాజెక్టును ఎట్టకేలకు రాష్ట్రానికి తిరిగి తీసుకువచ్చామని అన్నారు. గూగుల్, ఆర్సెలార్ వంటి సంస్థలు విశాఖకు రావడం లులూ సంస్థకు సానుకూల అంశమని తెలిపారు. మూడేళ్లలోగా మాల్ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లులూ మాల్ కేవలం షాపింగ్ మాల్ మాత్రమే కాదని, విశాఖ పర్యాటకానికి దోహదపడుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా మాల్స్ నిర్వహిస్తున్న లులూ సంస్థ అందుకు అవసరమయ్యే వ్యవసాయ ఉత్పత్తులను రాష్ట్రంలోని రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా లులూ చైర్మన్‌ను కోరారు. ఇదిలా ఉండగా.. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ లులూ సంస్థ ఒప్పందాలు చేసుకుంది. మామిడి, జామ పల్ప్‌తో పాటు మసాలా దినుసులను రాష్ట్రం నుంచి సేకరించి ఎగుమతి చేస్తామని వెల్లడించింది. వచ్చే జనవరి నుంచి ఎపి నుంచి ఎగుమతులు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. త్వరలోనే లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్టు లులూ గ్రూప్ చైర్మన్, ఎమ్‌డి యుసుఫ్ అలీ ప్రకటించారు. విశాఖ నగరంలో లులూ సంస్థ 13.83 ఎకరాలు, 13.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1,066 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ వరల్డ్ క్లాస్ మాల్‌తో ఐదు వేల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయని తెలిపారు.

పెట్టుబడులతో ముందుకొస్తాం

- సిఐఐ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు
- వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్ : కరణ్ అదాని ప్రశంస



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - విశాఖపట్నం

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ముందుకొస్తామని అనేక సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. పెట్టుబడుల సదస్సు ప్రారంభ సెషన్‌లో మాట్లాడిన వారు తమ ప్రసంగాల్లో ఈ మేరకు హామీ ఇచ్చారు. అదానీ పోర్ట్స్, సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బాగుందని, వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్‌గా ఎపి నిలుస్తోందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ వంటి రంగాల్లో అదానీ పనిచేస్తోందని, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టామని, ఇకపై కూడా పెట్టుబడులు పెడతామని అన్నారు.



మరో ప్రముఖ సంస్థ జిఎంఆర్ అధినేత మల్లికార్జునరావు మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాలు వస్తున్నాయని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఏరో స్పేస్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. భోగాపురం విమానాశ్రయంలోనే మెయింటైనెన్స్, మరమ్మతులు, ఓవర్ హాలింగ్ కేంద్రం కూడా ఉంటాయన్నారు.

దేశానికే గ్రోత్ ఇంజన్

దేశానికి ఆంధ్రప్రదేశ్ ఒక గ్రోత్ ఇంజన్‌గా కనిపిస్తోందని బజాజ్ ఫిన్ సర్వ్ చైర్మన్ సంజీవ్ బజాజ్ వ్యాఖ్యానించారు. సుదీర్ఘ సముద్ర తీరం కలిగిన రాష్ట్రం వాణిజ్యం, టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాలకు గేట్‌వే ఉంటోందన్నారు. యువతకు అండగా ఉండేందుకుగాను రాహుల్ బజాజ్ స్కిల్ కేంద్రాలను విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో ఏర్పాటుచేస్తామని ఆయన ప్రకటించారు.

సవాళ్లను అధిగమిస్తూ ముందుకు

ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న అనేక సవాళ్లను అధిగమిస్తూ భారత్ ముందుకెళ్తోందని భారత్ బయోటెక్ ఎమ్‌డి, సిఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె ఎల్లా వ్యాఖ్యానించారు. గ్రీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధి సాధించేలా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రపంచానికే వాక్సిన్ అందించే దేశంగా భారత్ ఆవిర్భవించిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు జినోమ్ వ్యాలీ ఎకోసిస్టమ్ తయారు చేశారని, అక్కడి నుంచే భారత్ బయోటెక్ కోవిడ్ వ్యాక్సిన్ తయారుచేసి అందించినట్లు వెల్లడించారు. ఇకపైనా రాష్ట్రంలో అభివృద్ధికి సహకరిస్తామన్నారు.

నౌకా నిర్మాణంలో పెట్టుబడులు

రాష్ట్ర అభివృద్ధిలో బాగస్వామ్యమవుతున్నట్లు భారత్ ఫోర్జ్ సంయుక్త ఎమ్‌డి అమిత్ కల్యాణి పేర్కొన్నారు. నౌకా నిర్మాణం, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే డిఫెన్స్ రంగంలోని ఉత్పత్తుల తయారీలో రాష్ట్రంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు నైపుణ్యం కల్పించే విషయంలోనూ భాగస్వామిగా ఉన్నట్లు చెప్పారు.

త్వరలో లులూ మాల్స్

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో అండేలా లులూ మాల్స్ ఏర్పాటుచేస్తున్నట్లు ఆ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ చెప్పారు. ఈ అత్యాధునిక మాల్స్‌తోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో విశాఖలో, జనవరి నాటికి విజయవాడలో మాల్స్ ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

సింగపూర్‌ను తలపించేలా అమరావతి నిర్మాణం

- ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల్లో ఆ దేశంతో కలిసి పనిచేస్తాం
- సింగపూర్ బృందంతో ఎంఒయు నేపథ్యంలో చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సింగపూర్‌ను తలపించేలా అమరావతిని నిర్మించి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సింగపూర్ ప్రభుత్వం, కంపెనీలు ఇన్నోవేటివ్ ఆలోచనలతో పరిశ్రమలను నడిపిస్తాయని, అలాంటి ఆలోచనలతో ముందుకు వచ్చే సింగపూర్ కంపెనీలతో పనిచేసేందుకు ఎపి ప్రభుత్వం ఉత్సాహంగా ఉందని తెలిపారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా తొలిరోజైన శుక్రవారం సిఎం చంద్రబాబు, సింగపూర్ హోం శాఖ మంత్రి షణ్ముగం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్, సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. అర్బన్ గవర్నెన్సు, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై ఈ అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ...ప్రపంచానికి అభివృద్ధి మోడల్‌గా మారిన సింగపూర్ అంటే తనకు అమితమైన అభిమానమన్నారు. అత్యంత బలమైన పబ్లిక్ పాలసీలు ఆ దేశంలో అభివృద్ధికి కారణమయ్యాయని తెలిపారు. లీక్వాన్యూ లాంటి నేతలు సింగపూర్‌ను అద్వితీయమైన దేశంగా మలిచారన్నారు. కోరగానే అమరావతి బృహత్ ప్రణాళికను రూపొందించి ఇచ్చిన సింగపూర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మధ్యలో కొన్ని సమస్యలు ఏర్పడినా మళ్లీ రాజధానిని పునర్నిర్మిస్తున్నామని అన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జి ఎకానమిగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రధాని మోడీ, ఎన్‌డిఎలపై ప్రజలకు విశ్వాసముందని, ఈ క్రమంలోనే బీహార్‌లో ఎన్‌డిఎకు విజయం దక్కిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సింగపూర్ అభివృద్ధి వేగాన్ని ఎపి అందుకునేలా పనిచేస్తామన్నారు. గాన్ సో హాంగ్ మాట్లాడుతూ.. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఎపి మారాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విజయవాడ - సింగపూర్ మధ్య వారంలో మూడు రోజుల పాటు విమాన సర్వీసులు నడవనున్నాయని ప్రకటించారు. ఇప్పటికే విశాఖ నుంచి సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. సింగపూర్ హోం శాఖ మంత్రి షణ్ముగం మాట్లాడుతూ.. ఎపిలో సింగపూర్ కంపెనీలకు పూర్తి సహకారం అందుతోందన్నారు. జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ద్వారా ఎపితో తాము కుదుర్చుకున్న ఒప్పందం అమలును పర్యవేక్షిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, సిఎస్ విజయానంద్ పాల్గొన్నారు.



సింగపూర్ బృందంతో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న లోకేష్, పక్కన చంద్రబాబు, రామ్మోహన్‌నాయుడు

త్వరలో 'కేన్సర్ అట్లాస్'

- ప్రాంతాల వారీ ముందస్తు ప్రణాళికల రూపకల్పన
- ప్రభుత్వ సలహాదారు దత్తాత్రేయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేన్సర్ కేసుల నమోదుకనుగుణంగా 'కేన్సర్ అట్లాస్' త్వరలో తయారవుతుందని ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు, ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు వెల్లడించారు. కేన్సర్ డిజీస్ బర్డన్ 5వ సలహా సమావేశం మంగళగిరిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన దత్తాత్రేయుడు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కేసుల నమోదుకు తయారయ్యే ఈ అట్లాస్‌కు అనుగుణంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు, వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు వీలవుతుందని చెప్పారు.

ఈ అట్లాస్‌ను సాధ్యమైనంత త్వరగా సిఎం చంద్రబాబు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే కాకుండా ఎన్‌సిడి 4.0 ద్వారా వచ్చే సమాచారాన్ని సైతం క్రోడీకరించి 'అట్లాస్' తయారుచేస్తామని చెప్పారు. ముఖ్యంగా ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా చికిత్స పొందుతున్న వారి వివరాల వల్ల ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులపై స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రముఖ సంస్థలు కేన్సర్ కేసుల తీవ్రతను ఓ నమూనా ద్వారా మాత్రమే ప్రకటిస్తున్నాయని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న వివరాల సేకరణ వల్ల విశ్వసనీయత, క్షేత్రస్థాయి సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. స్క్రీనింగ్ అనంతరం తదుపరి పరీక్షలకు అవసరమైన వారిని వైద్యుల వద్దకు పంపడంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. బోధనాస్పత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ల'పై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్టు సిఇఒ దినేష్‌కుమార్, ఎన్‌సిడి ప్రోగ్రాం జాయింట్ డైరెక్టర్ శ్యామల పాల్గొన్నారు.

400 ఎంఒయులు.. రూ.11.91 లక్షల కోట్ల పెట్టుబడులు

- సిఐఐ సమ్మిట్ ఒప్పందాల వివరాలు వెల్లడించిన ప్రభుత్వం
- 3,32,445 ఉద్యోగాలు దక్కుతాయని ప్రకటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు భారీగా ఒప్పందాలు జరిగాయి. 400 ఎంఒయుల ద్వారా రూ.11,91,972 కోట్ల పెట్టుబడులు, 13,32,445 ఉద్యోగాలు రానున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. అంచనాలకు మించి జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఎంఒయులు వచ్చినట్టు పేర్కొన్నారు. తొలిరోజు రూ.8.26 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 12.05 లక్షల ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు. వాటిలో సిఎం సమక్షంలో 41 ఎంఒయులు జరిగాయని, వీటి ద్వారా రూ.3.50 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. అలాగే మంత్రుల సమక్షంలో జరిగిన 324 ఒప్పందాలు ద్వారా రూ.8,41,786 కోట్ల పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం సిఎం చంద్రబాబు సమక్షంలో ఎఎం గ్రీన్ మెటల్స్, ఎకోరెన్ ఎనర్జీ, జాక్సన్ గ్రీన్, జిఎంఆర్ ఎనర్జీ, ఎస్సార్ రెన్యువబుల్స్, వారీ గ్రూప్, సీసన్ గ్లోబల్ ట్రేడింగ్, ఎస్‌ఎఇఎల్, జెఎం బక్సీ సంస్థల ప్రతినిధులు ఈ ఒప్పందాలు చేసుకున్నారు. కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బిసి జనార్ధన్‌రెడ్డి, సిఎస్ విజయానంద్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.




సిఐఐ సమ్మిట్‌కు హాజరైన కంపెనీల ప్రతినిధులు

ఎఎం గ్రీన్ పలు ఎంఒయులు

ఎఎం గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్ నిర్మాణంపై ఒప్పందం చేసుకుంది. ఒక మిలియన్ టన్ను గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్ నిర్మాణంపై ఎపి ప్రభుత్వంతో ఈ ఎంఒయు కుదిరింది. రూ.40 వేల కోట్లతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో పరిశ్రమ పెట్టేందుకు ఎఎం గ్రీన్ ఈ ఒప్పందాన్ని చేసుకుంది. ఇప్పటికే ఎపిలో రూ.50 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టుల్లో ఎఎం గ్రీన్ పెట్టుబడులు పెట్టిందని సిఎం చంద్రబాబు తెలిపారు. మరో రూ.పది వేల కోట్లతో సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయెల్ తయారీ యూనిట్‌ను ఎపిలో ఎఎం గ్రీన్ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో సెకండ్ జనరేషన్ ఇథనాల్ బయో రిఫైనరీ పరిశ్రమలు పెట్టేందుకు ఈ సంస్థ సిద్ధమైనట్లు కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ ప్రకటించారు.

విస్ఫాట్ కవాచ్ ఐఎక్స్‌లో ఆక్టోపస్ బృందానికి రెండో స్థానం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక 9వ నేషనల్ జాయింట్ కౌంటర్ ఐఇడి ఎక్సర్‌సైజ్-విస్ఫాట్ కవచ్-9లో రాష్ట్రానికి చెందిన ఆక్టోపస్ బృందం రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయం సాధించడం పట్ల డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఆక్టోపస్ ఐజిపి (ఆపరేషన్స్) సిహెచ్ శ్రీకాంత్, డిఐజి సెంథిల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయి పోటీలు హర్యానాలోని మనేసర్ నేషనల్ సెక్యూరిటీ గార్డ్సు (ఎన్‌ఎస్‌జి) ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల ప్రధాన లక్ష్యం ఐఇడి ముప్పును ఎదుర్కొనే సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, బాంబు శోధన, గుర్తింపు, నిర్వీర్యం వంటి కీలక రంగాల్లో బృందాల నైపుణ్యాలను పరీక్షించడం, ఉత్తమ పద్ధతులను పరస్పరం పంచుకోవడమని తెలిపారు.

రాష్ట్రంలో రూ.2500 కోట్లతో ప్రాజెక్టు

- డైకిన్ సంస్థ సిఇఒ నిమ్మగడ్డ కుటుంబరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ త్వరలో ఎపిలో రూ.2500 కోట్లతో మరో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నెలకొల్పనుందని ఆ సంస్థ సిఇఒ నిమ్మగడ్డ కుటుంబరావు వెల్లడించారు. సిఐఐ సదస్సులో ఎంఒయు చేసుకోవడానికి శుక్రవారం విచ్చేసిన ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. శ్రీ సిటీలో ఇప్పటికే ప్రాజెక్టు నడుస్తోందని, రెండువేల మంది ఉపాధి పొందుతున్నారని, త్వరలో ఎపిలో మరోచోట యూనిట్ స్థాపించి సుమారు ఐదువేల మందికి ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు ప్లాంట్లు డైకిన్‌కు ఉన్నాయని, మూడో ప్లాంట్‌ను 125 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తున్నామని తెలిపారు.

విజయనగరం జిల్లాలో రూ.300 కోట్లతో రెన్యు సోలార్ ప్రాజెక్టు
- విన్‌సోల్ గ్రీన్ సొల్యూషన్స్ సిఇఒ మేకా శేషగిరి



రెన్యు సోలార్ ప్రాజెక్టు యూనిట్‌ను రాష్ట్రంలో రూ.300 కోట్లతో 70 మెగావాట్ల సామర్థ్యంతో త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని విన్‌సోల్ గ్రీన్ సొల్యూషన్స్ సిఇఒ మేకా శేషగిరి వెల్లడించారు. సిఐఐ సదస్సుల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన శుక్రవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో తాము ఇదివరకే కొనుగోలు చేసిన భూమి ఉందని, ఆ యూనిట్‌ను అక్కడ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. 2026 డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, సుమారు 200 మందికి ఉపాధి కల్పించబోతున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఇంకా అనేక ప్రాజెక్టులను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోతున్నామని చెప్పారు.

విశాఖలో అదాని డేటా సెంటర్ ఏర్పాటు



విశాఖలో గూగుల్-అదాని డేటా సెంటర్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయబోతున్నామని అదాని ప్రాజెక్టు ప్రతినిధులు రమేష్‌బాబు (సిఎస్‌ఆర్ హెడ్), ఎ.చౌదరి (మార్కెటింగ్ హెడ్), గోవింద్ (ఆఫీస్ సిఇఒ) 'ప్రజాశక్తి'కి తెలిపారు. సిఐఐ సదస్సులో తొలిరోజు శుక్రవారం వీరు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానంపై తమ ప్రాజెక్టులు ఆధారపడి ఉంటాయని, అనేక రంగాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని అన్నారు. ఈ సమ్మిట్‌కు గంగవరం పోర్టు సిఇఒ అమిత్ మాలిక్, అదాని తనయుడు కరణ్ అదాని హాజరైనట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురాన్ని మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. క్యాంపు కార్యాలయం నుంచి పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, దేవాదాయశాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఆలయాలతోపాటు 19 ఆలయాల అభివృద్ధి నిమిత్తం కామన్‌గుడ్ ఫండ్ నుంచి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ఇప్పటికే దేవాదాయశాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని, మ్యాచింగ్ గ్రాంట్‌తో నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ఇందులో రూ.6 కోట్లు శ్రీపురుహూతిక అమ్మవారు, శ్రీకుక్కుటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కేటాయిస్తున్నారన్నారు. మరో నాలుగు ఆలయాలను ధూప దీప నైవేద్యం పథకం పరిధిలో తీసుకొచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల పరిరక్షణ, భద్రత, అభివృద్ధికి అధికారుల బాధ్యతల నిర్వహణతోపాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమన్నారు.

బీహార్‌లో ఎన్‌డిఎ విజయం పట్ల హర్షం

బీహార్‌లో ఎన్‌డిఎ విజయం పట్ల డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశ సమగ్రాభివృద్ధి, సుస్థిరపాలన సాధ్యమని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని, ఈ విషయం బీహార్ ఎన్నికల ఫలితాలతో రుజువైందని అన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

- రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాలు అందించిన యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందించినట్లు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేసిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనంతో పాటు యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ బాలల దినోత్సవం సందర్భంగా వినతిపత్రాలు అందించామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారనే కారణం చూపి కేంద్రాలను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. ఇవి బలోపేతం కావాలంటే 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదయ్యేలా చూడాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా జిఓ ఇవ్వాలన్నారు. పిల్లలకు ఇచ్చే మెనూలో క్వాంటిటీని పెంచాలని కోరారు. పిల్లలకు గుడ్లు, పాలు, భోజనం, ఉదయం 12:30 గంటలకే పూర్తవుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో ఉంటున్న సందర్భంగా వారికి స్నాక్స్, బిస్కెట్స్ అందించాలని కోరారు.



మార్కెట్లలో కానరాని బీహార్ జోష్..!

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 450 పాయింట్ల పతనం
- తుదకు స్వల్ప లాభాలు..

ముంబయి : బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఆధిక్యం కనబడినప్పటికీ స్టాక్ మార్కెట్లలో ఎలాంటి ఉత్సాహం కానరాలేదు. శుక్రవారం ఉదయం నుంచే అమ్మకాల ఒత్తిడి చోటు చేసుకుంది. ఎన్‌డిఎ అభ్యర్థులు మెజారిటీ వైపు సాగుతున్నప్పటికీ మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపలేదు. లోహ, ఐటి షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 450 పాయింట్ల మేర పతనమై 84,029 కనిష్టానికి పడిపోయింది. చివరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో కేవలం 84 పాయింట్లు పెరిగి తుదకు 84,562 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 31 పాయింట్ల లాభంతో 25,910 వద్ద ముగిసింది. ఇంతక్రితం సెషన్‌లో వాల్‌స్ట్రీట్‌లో ఎఐ సంబంధిత కంపెనీల స్టాక్స్‌లో అమ్మకాలు, డిసెంబర్‌లో వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చన్న ఫెడ్ అధికారుల సంకేతాలు మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురి చేశాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, బిఇఎల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బిఐ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఐచర్ మోటార్స్, టాటా స్టీల్, ఐసిఐసిఐ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.08 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.38 శాతం చొప్పున పెరిగాయి. పిఎస్‌యు బ్యాంకింగ్ అధికంగా 1.17 శాతం లాభపడ్డాయి. ఫార్మా, ఎఫ్‌ఎంసిజి రంగాలు వరుసగా 0.59 శాతం, 0.57 శాతం చొప్పున రాణించగా.. ఐటి అత్యధికంగా 1.03 శాతం నష్టపోయింది.

ధాన్యం దళారుల భోజ్యం

- కఠిన నిబంధనలతో అన్నదాతకు కష్టాలు
- కానరాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు



గండేపల్లిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎంత ధాన్యమైనా కొంటాం. లక్ష్యానికి మించి కొనుగోలు చేస్తామంటూ ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ నిబంధనల వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.45 లక్షల మంది రైతులు 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఏటా ఈ సీజన్‌లో 5.70 లక్షల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గండేపల్లిలో 70 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. పెదపూడి, సామర్లకోట, యు.కొత్తపల్లి, కరప, పిఠాపురం తదితర మండలాల్లో ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఎకరాకు సరాసరి 34 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది.

అరకొర కొనుగోళ్లు

జిల్లాలో 269 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నెల 22 నుంచి గండేపల్లిలో అధికారికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయితే ఇప్పటి వరకు కేవలం 17 కేంద్రాలలో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించారు. వీటి ద్వారా సుమారు 2,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఉదాహరణకు గండేపల్లి మండలంలో సుమారు 7,300 ఎకరాలలో ఈ ఏడాది రైతులు వరిని పండించగా ఇప్పటివరకు 70 శాతం కోతలు పూర్తయ్యాయి. ఈ మండలంలో ఇప్పటి వరకు పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కేవలం 70 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు.

ప్రభుత్వ నిబంధనలు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలంటే ముందు రైతు సేవా కేంద్రానికి వెళ్లి సమాచారం ఇచ్చి కూపన్ తీసుకోవాలి. తరువాత సిబ్బంది వచ్చి నమూనాలు తీసుకుంటారు. 17 శాతం కంటే తేమ ఎక్కువైతే ఆరబెట్టి తీసుకురావాలని సచివాలయ సిబ్బంది సూచిస్తున్నారు. ఇప్పటికే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. దీని వల్ల రైతులకు నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకానికి (75 కిలోలు) రూ.1,792, కామన్ రకానికి (75 కిలోలు) రూ. 1,777 ప్రకటించింది. కానీ పలు ప్రాంతాలలో దళారులు రైతుల వద్ద నుంచి 75 కిలోల బస్తాను కేవలం రూ.1200 నుంచి 1400లోపే కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనల వల్ల ప్రైవేటుకే...



40 ఎకరాలు సాగు చేయగా ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వచ్చింది. తేమ శాతం, ఇతర నిబంధనల వల్ల బస్తా రూ.1400 చొప్పున ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాను. ప్రభుత్వం నిబంధనలను సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- గద్దె సతీష్, రైతు, గండేపల్లి.

అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది



1.25 సెంట్లకు 50 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాల సిబ్బంది అందుబాటులో లేరు. ఎవరికి అమ్మాలో తెలియలేదు. చివరకు రూ.1400 చొప్పున ప్రైవేటు వ్యాపారికి అమ్మాను.

- అనిశెట్టి లోవరెడ్డి, రైతు, నాగులాపల్లి, యు.కొత్తపల్లి మండలం.



అల్లవరం మండలంలో పర్యటిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం బృందం

ఆక్రమణలో ప్రభుత్వ భూములు, కొబ్బరి చెట్లు

- ఫలసాయం అనుభవిస్తున్న భూస్వాములు
- ఎపి వ్యకాస సర్వేలో వెల్లడి
- భూములు, చెట్ల కోసం పేదలు ఉద్యమించాలి : దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - అమలాపురం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక, గోడి, దేవగుప్తం, తూర్పులంక, గోడితిప్ప, సిరిగట్లపాలెంలో ప్రభుత్వ భూముల్లోని కొబ్బరి చెట్లపై సర్వే నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సర్వేలో ఆశ్చర్యకరమైన అంశాలు బయట పడ్డాయని పేర్కొన్నారు. కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు గోడిలంక గ్రామంలో సమాచార హక్కు చట్టం ప్రకారం ఏయే భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయనే సమాచారం తీసుకున్నట్టు తెలిపారు. దీని ప్రకారం ఒక్క గోడిలంకలోనే సుమారు 60 ఎకరాలు పైబడి వివిధ ప్రభుత్వ భూములు ఉన్నట్టు తేలిందన్నారు. ఈ భూములు అగ్రకుల భూస్వాముల చేతుల్లో ఉన్నాయని, వీటి ఫలసాయము కూడా వారే అనుభవిస్తున్నారని తెలిపారు. సర్వే బృందం ఆయా గ్రామాల్లోని దళిత నాయకులతో వ్యవసాయ కార్మికులు నాయకులతో మాట్లాడినప్పుడు వారిలో నూతన చైతన్యం కనబడుతోందని తెలిపారు. రాజకీయాలు, కులాలతో నిమిత్తం లేకుండా పేదలందరినీ ఐక్యం చేసి కొబ్బరి చెట్ల పంపిణీకి పూనుకోవాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సర్వేలో ఆయా గ్రామాల ప్రజలు వెల్లడించిన ప్రకారం.. సుమారు ఒక్కో గ్రామంలో మూడు వేల నుండి నాలుగు వేల కొబ్బరి చెట్లు అక్రమంగా, చట్టవిరుద్ధంగా భూస్వాముల చేతిలో ఉన్నట్టు తేలిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పేదల హక్కులను కాలరాస్తున్న ఈ దోపిడీని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఉన్న ఈ కొబ్బరి చెట్లను తక్షణమే స్వాధీనం చేసుకుని, పేద కుటుంబాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జీవనోపాధి కల్పించేందుకు ఒక్కో పేద కుటుంబానికి కనీసం పది కొబ్బరి చెట్లను కేటాయించాలని కోరారు.

సర్వే అనంతరం అల్లవరం మండల కేంద్రంలో ఒక పెద్ద సభ జరిపి ఆ సభలో తీర్మానం చేసి అధికారులకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. ఈ సర్వేలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త : ఎస్‌బిఐ కార్డ్

న్యూఢిల్లీ : అన్ని రకాల ఆర్థిక లావాదేవీలలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బిఐ కార్డ్ సూచించింది. అదే విదంగా ధైర్యంగా, భద్రంగా షాపింగ్ చేయడానికి కొన్ని ముఖ్యమైన భద్రతా సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించింది. అంతర్జాతీయ మోసాల అవగాహనా వారోత్సవం సందర్భంగా ఎస్‌బిఐ కార్డ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎప్పుడూ అధికారిక బ్రాండ్ వెబ్‌సైట్లు లేదా విశ్వసనీయమైన మార్కెట్‌ప్లేస్‌లలో మాత్రమే కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించింది.. సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్‌ల ద్వారా వచ్చే నకిలీ వెబ్‌సైట్ల ర్యాండమ్ లింకులు లేదా అటాచ్మెంట్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. లేదంటే అవి డిజిటల్ మోసాలకు ప్రధాన ద్వారాలుగా ఉపయోగించబడతాయని పేర్కొంది. సెప్టెంబర్ 2025లో ఇ-కామర్స్ మొత్తం విక్రయాల్లో 66.4 శాతం వాటా క్రెడిట్ కార్డులదేనని గుర్తు చేసింది. డిజిటల్ చెల్లింపు పద్ధతుల వినియోగం పెరుగుతున్న తరుణంలో, వినియోగదారులు ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండటం, అందుబాటులో ఉన్న ఆఫర్లు, డీల్స్‌ను తెలివిగా వినియోగించుకోవాలని సూచించింది.

రాంకీ ఇన్‌ఫ్రా చేతిలో రూ.9వేల కోట్ల ఆర్డర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ మౌలిక వసతుల కంపెనీ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చేతిలో 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి రూ.9,000 కోట్ల ఆర్డర్లు ఉన్నట్లు వెల్లడించింది. గడిచిన జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి నుంచి రూ.2,085 కోట్ల విలువైన ఆర్డర్లు రావడం ద్వారా ఆర్డర్ బుక్ ఈ స్థాయికి చేరినట్లు ఆ సంస్థ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 75.60 కోట్ల నికర లాభాలను నమోదు చేసినట్లు తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.83 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.527.40 కోట్ల ఆదాయం ఉండగా.. గడిచిన క్యూ2లో రూ.471.60 కోట్లకు పరిమితమైంది.

'యమున' కిడ్నీ ఏమైనట్లు..?

- బెంగళూరు డాక్టర్ దొరికితేనే కేసు పురోగతి
- రెండు బృందాలతో గాలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కిడ్నీ రాకెట్ దురాగతంతో ప్రాణాలు కోల్పోయిన యమునకు ఎడమవైపు కిడ్నీ లేదని పోస్టుమార్టం నివేదికలో వైద్యులు తేటతెల్లం చేశారు. అయితే ఆ కిడ్నీ ఏమైందనేది పోలీసులకు కూడా అంతుచిక్కడం లేదు. బెంగళూరుకు చెందిన ఓ యురాలజీ డాక్టర్ మదనపల్లెకు వచ్చి గ్లోబల్ హాస్పిటల్‌లో యమునకు కిడ్నీ ఆపరేషన్ చేసి కిడ్నీని తొలగించాడని పోలీసులు చెబుతున్నారు. ఆ కిడ్నీ గోవాకు చెందిన రంజన్ నాయక్‌తో బేరం కుదుర్చుకున్నట్లు సమాచారం. అయితే కిడ్నీ ఆపరేషన్ చేసిన డాక్టర్ పరారీలో ఉండడంతో ఆ కిడ్నీ విక్రయించారా? బెంగళూరులోనే ఎవరికైనా అమర్చారా? గోవాకు పంపారా?లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కిడ్నీ ఎవరికి చేర వేశారన్నది బెంగళూరు డాక్టర్ దొరికితేనే తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు. పరారీలో ఉన్న అతని కోసం రెండు బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే పట్టుకుంటామని మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. కాగా, కిడ్నీ రాకెట్ కేసులో ఉన్న డాక్టర్ ఆంజనేయులు, టెక్నీషియన్లు బాలరంగడు, మెహరాజ్, పద్మ, సత్య, సూరిబాబులను డిఎస్‌పి కార్యాలయంలో విచారిస్తున్నారు.



యమున (ఫైల్ ఫొటో)

ఆధారాలు చెరిపేసిన గ్లోబల్ ఆస్పత్రి యాజమాన్యం


గ్లోబల్ ఆస్పత్రి ముందు, లోపల వివిధ ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల డేటాను తొలగించి ఆధారాలు తారుమారు చేశారు. పోలీసులు ఆస్పత్రిలోని సిసి కెమెరాల పుటేజీలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నా, వారికి డేటా డిలీట్ అని రావడంతో విస్తుపోయినట్లు తెలుస్తోంది.

పోలీసుల దర్యాప్తు తీరుపై విమర్శలు

కిడ్నీ రాకెట్‌లోని ముఠాను పట్టుకోవడానికి పోలీసులు బృందాలుగా ఏర్పడి, ఒకవైపు దర్యాప్తు కొనసాగిస్తూ అనుమానితులను అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం. అయితే ఇప్పటికే ఆధారాలు చెరిపేసిన కిడ్నీ రాకెట్‌లోని బృందం బాగోతం బయటపడిన పుటికీ ఆ ఆస్పత్రి యాజమాన్యంలోని డాక్టర్ ఆంజనేయులు మినహా అందులో పనిచేస్తున్న వైద్య బృందం డాక్టర్ అవినాష్, డాక్టర్ శాశ్వతిలపై ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడంతో పోలీసుల దర్యాప్తు తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

మరో అప్పు

- రాజధాని కోసం మొత్తం రూ.40 వేల కోట్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం అప్పులు చేస్తూనే ఉంది. ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఎబిడితోపాటు ఇతర రుణాలు ఇప్పటికే తీసుకున్న ప్రభుత్వం వేర్వేరు సంస్థల నుంచి మరో రూ.9 వేలకోట్లు తీసుకుంటోంది. దీంతో మొత్తంగా రాజధాని అమరావతి అప్పు దాదాపు రూ.40 వేలకోట్లకు చేరింది. భవిష్యత్‌లో భూమి విలువలు పెరిగితే వాటిని అమ్మి అప్పులు తీరుస్తామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం కష్టంగానే మారొచ్చని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. గతంలో ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేలకోట్లు తీసుకున్నారు. హడ్కో నుంచి రూ.7 వేలకోట్లు, బ్యాంకుల కన్సార్టియం, వేర్వేరు సంస్థల నుంచి రూ.7 వేలకోట్లు తీసుకున్నారు. ఇవి కాకుండా అంతకు ముందు తీసుకున్న మరో రూ.5 వేలకోట్ల అప్పు కొనసాగుతోంది. దానికి ఇప్పటికీ వడ్డీ చెల్లిస్తూనే ఉన్నారు. వీటితోపాటు కొత్తగా నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (ఎన్‌బిఎఫ్ఐడి) నుంచి రూ.7,500 కోట్లు తీసుకున్నారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా అందాయి. వీటితో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కట్టాలని నిర్ణయించారు. అలాగే కొత్తగా పెనుమాక, ఉండవల్లి, కృష్ణాయ పాలెం పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకూ వినియోగించనున్నారు. ఇవి కాకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.1500 కోట్లు తీసుకుంటున్నారు. వీటికి ప్రభుత్వం గ్యారంటీ కూడా ఇచ్చింది. ఇప్పటికే హడ్కో నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి కొత్త వడ్డీ కూడా కడుతున్నారు. ఇవి కాకుండా బాండ్ల రూపంలో మరికొన్ని రుణాలు తీసుకున్నారు. ఇన్ని రూపాల్లో అప్పులు తీసుకుంటున్న సిఆర్‌డిఎ వాటిని తీర్చేందుకు రాజధాని నుంచి వచ్చే యూజర్ ఛార్జీలు, ఇతరత్రా పన్నుల నుంచి చెల్లిస్తామని పేర్కొంది. వాస్తవంగా అంత ఆదాయం రాకపోతే పట్టణాభివృద్ధిశాఖ నుంచి వీటి పన్నులు కట్టాల్సి ఉంటుంది. దీనికితోడు అదనంగా విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించారు. దీనికి ఎస్‌పివి కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది, ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలకు మరికొంత ఖర్చవుతుంది. దాని కోసమూ అదనంగా అప్పులు తీసుకోవాల్సి ఉంటుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఇప్పుడు ఏర్పాటు చేస్తే నిర్మాణాలకు సంబంధించి నిర్వహణ వ్యయం కూడా ఉంటుంది. వాస్తవంగా మొదటి దశలో చేపట్టే పనులకు రూ.64 వేలకోట్లు ఖర్చవుతాయని గతంలో అంచనా వేస్తే ప్రస్తుతం అవి రూ.లక్ష కోట్లకు చేరుతున్నాయి. పెరుగుతున్న అంచనాలతో పాటు అప్పులు కూడా పెరుగుతున్నాయి.

సంపాదకీయం

బీహార్ పాఠాలు

హోరాహోరీగా సాగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ మళ్లీ విజయం సాధించడం ఆర్‌జెడి నాయకత్వంలోని మహాగట్ బంధన్ (ఎంజిబి)కి ఎదురు దెబ్బ. పాలక సంకీర్ణ కూటమి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని, అనేక అవకతవకలకు పాల్పడుతూ, పెద్ద మొత్తంలో డబ్బును వెదజల్లిందన్న ప్రాథమిక విశ్లేషణలు సత్యదూరం కాకపోవచ్చు. అయితే, నితీష్ కుమార్ ప్రభుత్వం చేపట్టిన సైకిళ్ల పంపిణీ తదితర సంక్షేమ చర్యలు, మద్య నిషేధం వంటివీ ఎన్నికల విజయానికి సోపానాలయ్యాయి. ఎన్‌డిఎ గెలుపులో ప్రధానంగా మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించారు. ప్రతి ఎన్నికల్లోనూ బిజెపి అమలు చేసే సోషల్ ఇంజనీరింగ్‌తోపాటు ప్రధాని, హోంమంత్రి అంతటి అత్యున్నత స్థానాల్లో వున్నవారితో సహా తమ నేతలు చేసే మతోన్మాద, కులతత్వ వ్యాఖ్యలు, వాక్చాతుర్యం వంటి వాటి నుండి ఎన్‌డిఎ ప్రయోజనం పొందిందన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. బిజెపి కొమ్ము కాస్తూవస్తున్న కార్పొరేట్ మీడియా వాటిని చాకచక్యంగా ప్రజలకు చేరవేసింది. రెండవ దశ పోలింగ్‌కు ఒక్కరోజు ముందు ఢిల్లీలో జరిగిన బాంబు విస్ఫోటనం మతపరమైన విభజన పెరగడానికి, విద్వేష వ్యాప్తికీ కారణమైంది. బీహార్ ఎన్నికల్లో కొత్త శక్తిగా ముందుకు వచ్చిన ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జనసురాజ్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చి ఎన్‌డిఎకు ఉపయోగపడిందన్న విశ్లేషణలు కూడా వస్తున్నాయి. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) పేరిట నిరంకుశంగా 65 లక్షల మంది ఓట్లర్లను తొలగించిన ఎన్నికల కమిషన్ కూడా ఎన్‌డిఎ కు తోడ్పడిందన్న విమర్శను కొట్టి పారేయలేం. ఎన్నికల ప్రక్రియ సాగుతున్నా లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం నుండి పది వేల రూపాయల చొప్పున బట్వాడా చేస్తున్నా దాన్ని నివారించకుండా ఎన్నికల కమిషన్ మిన్నకుండిపోవడం అందుకో గట్టి నిదర్శనం. గతంలో ఇటువంటివాటిని ఇసి సూమోటోగా నిలుపుదల చేసిన దృష్టాంతాలెన్నో వున్నాయి. ఫిర్యాదులు చేసినప్పటికీ జ్ఞానేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఇసి మౌనం దాల్చడం దాని పాక్షిక దృష్టికి మచ్చుతునక. వీటన్నిటి మధ్య మహాగట్‌బంధన్ లేవనెత్తిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, వలసలు పోతున్న దుస్థితి వంటి కీలక ప్రజా సమస్యలు అంతగా చర్చనీయాంశాలు కాకపోవడం విచారకరం.

అసెంబ్లీలోని 243 స్థానాలకుగాను ఎన్‌డిఎ 202 స్థానాల్లో గెలుపొంది భారీ ఆధిక్యాన్ని సాధించగా, ఎంజిబి 35 సీట్లకు పరిమితం కావలసివచ్చింది. అయితే, ఆర్‌జెడి అధికారానికి రాలేకపోయినా రాష్ట్రంలో అత్యధిక ఓట్లు సాధించడం అభినందనీయం. అలాగే ప్రాంతీయ పార్టీలతో చెలిమి చేసి వారి ప్రజా పునాదిని బిజెపి తినేస్తుందన్న వాస్తవం బీహార్ ఫలితాల్లోనూ స్పష్టమైంది. ఇంత తీవ్రమైన పోటీలో విభూతిపూర్ నియోజకవర్గంలో సిపిఐ(ఎం), రెండు నియోజకవర్గాల్లో సిపిఐ (ఎంఎల్- లిబరేషన్) గెలుపొందడం ఎడారిలో ఒయాసిస్సులాంటిదే! అణచివేతకు, దోపిడీకి గురవుతున్న వారి హక్కుల కోసం వామపక్షాలు సాగించే పోరాటాలకు ఈ విజయం తోడ్పడుతుందని ఆశించవచ్చు. మొత్తంగా చూస్తే బిజెపిని ఓడించడానికి ప్రతిపక్ష పార్టీలు మరింత సమైక్యంగా కృషి చేసి వుండాల్సిందని ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లలో పోటీ చేసి గెలవలేక విపక్షానికి చేటు చేసిందని ఆనాటి ఫలితాల విశ్లేషణలో తేలింది. ఈ ఎన్నికల్లో ఎంజిబి పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, స్నేహపూర్వక పోటీల పేరిట ఓట్ల చీలికకు దారితీసిన కారణాలేమిటో ఆయా పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఫలితాల వెనుక గల ఇతర కారణాలను సవివరంగా సమీక్షించుకుంటేనే భవిష్యత్తులో పరివార్ శక్తుల కుట్రలను ఎదుర్కోవడం, వాటిని తిప్పికొట్టడం పూర్తి స్థాయిలో సాధ్యమవుతుంది. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం, సుహృద్భావం పెరగాలి. ఉమ్మడి శత్రువును ఐక్యంగా ఓడించాలన్న స్ఫూర్తి మరింత అభివృద్ధి కావాలి. ప్రజా ధనాన్ని శత సహస్ర కోటీశ్వరులకు కట్టబెడుతున్న మతతత్వ- కార్పొరేట్ కూటమి పాలనకు వ్యతిరేకంగా ఐక్య ప్రజా ఉద్యమాలు సాగించాలి.

మహనీయుల మాట



కృత్రిమ, తాత్కాలిక ఆనందాల వెంట పరుగులు తీయడం కన్నా ఒక గొప్ప విజయం కోసం అంకిత భావంతో కృషి చేయడం మిన్న. అలా లభించే ఆనందం శాశ్వతమైనది, సార్థకమైనది.
- మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, భారత తొలి విద్యాశాఖా మంత్రి.

వంచనాశిల్పంతో ఆర్.ఎస్.ఎస్ మనుగడ

వ్యాఖ్య

ఆర్‌ఎస్‌ఎస్ యోగ్యతల గురించి దేశంలో ఓ వివాదం, ఓ చర్చ చెలరేగుతున్నాయి. ఈ సంస్థ చట్టబద్ధంగా రిజిస్టర్ కాలేదన్న అంశం వెలుగులోకి రావడంతో ఈ వివాదం కేంద్ర స్థానంలోకి వచ్చింది. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వాలలో వివిధ స్థాయిల్లో వున్న మంత్రులకు ఇలాంటి చర్చ చేయడమంటే దైవదూషణ కన్నా ఘోరమైన అపరాధమే. తామే ఎల్లప్పుడూ సరైనవారమనే ధోరణిలో వుండే పాలక పార్టీ ఇలాంటి ప్రశ్నలను ఏ మాత్రం సహించడమన్న ప్రసక్తి వుండదు. జర్మనీ, ఇటలీ ఫాసిస్టులతో బంధం పెనవేసుకున్న వ్యవస్థాగత స్వరూపం ఆర్‌ఎస్‌ఎస్ ది. ఈ కారణంగా వారు అలా అసహనాన్ని, అహంభావాన్ని కనబరచడం వారి సహజ లక్షణమే.

ప్రధాని మోడీ ఆగష్టు 15న ఎర్రకోట పైనుంచి చేసిన ప్రసంగంలో ఆర్‌ఎస్‌ఎస్ ను, దాని గతాన్ని నిస్సంకోచంగా కీర్తనలతో ముంచెత్తారు. ఓ మాజీ ప్రచారక్ నుంచి ఈ విధమైన ప్రశంసల వాన కురవడం ఆశ్చర్యమేమీ కాదు. ఆ కోట బురుజుల మీద నుంచి మాట్లాడిన మోడీ ఆర్‌ఎస్‌ఎస్ ను దేశ సేవలో నిమగ్నమైన ఎన్‌జివో గా అభివర్ణిస్తూ చట్టబద్ధత కల్పించారు. చూడ్డానికి వింతగా అనిపించవచ్చు గాని ఒక సంస్థగా తాను రాజ్యాంగ బద్ధమైన, ప్రామాణిక చట్టబద్ధ పద్ధతులలో పని చేయడం లేదన్నది ఆర్‌ఎస్‌ఎస్ స్వయంగా అంగీకరించిన విషయం. అయితే దాన్ని కొంతమంది వ్యక్తుల బృందంగా గుర్తించిన కారణంగా ఏ విధమైన రిజిస్ట్రేషన్ అవసరం లేదన్నట్టు ఇప్పుడీ చర్చతో ముందుకొచ్చింది.



> వ్యక్తుల బృందంగా వున్న ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. సంస్థగా దాని స్థాపనకు మూల సూత్రం హిందూ రాష్ట్ర సాధన కోసం కృషి చేయడం. హిందువులను సంఘటితం చేయడం, హిందూత్వను సైనికీకరించడం దాని ప్రేరణ సిద్ధాంతం. సంఘ్‌కు అత్యున్నత సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్ సాధికారికంగా చెప్పిందదే.

PEOPLE'S DEMOCRACY

ప్రశ్నలు సశేషం

అయితే అంతటితోనే రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన చర్చ మటుమాయమై పోదు. బిజెపి నేతృత్వ ప్రభుత్వంలోని మంత్రులకు ఈ విషయమై చెప్పడానికి నోరు పడిపోవడంతో ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. 'సంఘ్ వందేళ్ల ప్రయాణం:నూతన అవకాశాలు-సవాళ్లు' అనే విషయమై నవంబరు 9న ఆయన బెంగళూరులో మాట్లాడారు. "సంఘ్ 1925లో స్థాపించబడిందని మీకు తెలుసా? మా సర్‌సంఘ్‌చాలక్ (కె.బి హెగ్డేవార్) ఆ సమయంలో ఏ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగానైతే పోరాడుతున్నారో...దాని దగ్గర మేము రిజిస్టర్ చేయించుకోవాలని మీరు ఆశిస్తున్నారా? ఇక స్వాతంత్ర్యానంతరమైతే భారతీయ చట్టాల ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరేమీ కాదు. వ్యక్తుల బృందాలతో ఏర్పడిన సంస్థలకు కూడా చట్టబద్ధత లభిస్తుంది. మేము వ్యక్తుల బృందంగానే గుర్తించబడ్డాము." భగవత్ ముందుకు తెచ్చిన వాదనల ప్రధాన సారాంశం ఇది.

ఇక్కడ ముందుగా చెప్పాలంటే హెగ్డేవార్ కాంగ్రెస్‌తో సంబంధం కలిగివున్న మాట నిజమే. ఆ విధంగా ఆయన స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి కావడం కూడా ఎలాగూ జరిగిపోతుంది. అయితే వ్యక్తుల బృందంగా వున్న ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. సంస్థగా దాని స్థాపనకు మూల సూత్రం హిందూ రాష్ట్ర సాధన కోసం కృషి చేయడం. హిందువులను సంఘటితం చేయడం, హిందూత్వను సైనికీకరించడం దాని ప్రేరణ సిద్ధాంతం. సంఘ్‌కు అత్యున్నత సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్ సాధికారికంగా చెప్పిందదే.

కులం, జాతి, తెగ, మతం వంటి తేడాలతో నిమిత్తం లేకుండా సాంస్కృతిక, భాషా వైవిధ్యాలు పాటించకుండా ప్రజలందరూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో కలసి పోరాడాలనే భావనకు కూడా ఆర్‌ఎస్‌ఎస్ తన ప్రతికూలతను పునరుద్ఘాటిస్తూ వచ్చింది. అందువల్ల బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతున్నందున తాము రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని చెప్పుకోవడం సత్యాన్ని పచ్చిగా తారుమారు చేయడమే అవుతుంది.

ఇ.డి దూకుడు ఏమైంది?

జాతీయంగా సాగే ఆర్థిక అక్రమాలను అరికట్టడం గురించీ, న్యాయమైన పన్ను వనరులను పక్కదోవ పట్టించడం గురించీ ఇటీవలనే బిజెపి నేతృత్వ ప్రభుత్వం మాట్లాడింది. ప్రత్యేకించి మోడీ ప్రభుత్వం మనీ లాండరింగ్‌ను నిరోధించే పి.ఎం.ఎల్.ఎ చట్టానికి బాగా పదును పెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు హద్దూ అదుపూ లేని విస్తార అధికారాలు కల్పించింది. ఇసుమంత సాక్ష్యం లేకున్నా కేసులు నమోదు చేసేందుకు, వ్యక్తులను అరెస్టు చేసేందుకు అవకాశమిచ్చింది. ప్రతిపక్షాలపై పాక్షికతతో కూడిన దాడి చేసేందుకు ఈ నిబంధనలను ఎలా దుర్వినియోగం చేస్తున్నారనేదానికి కావలసినన్ని కేసులు ఉదాహరణలుగా వున్నాయి. ఆ విధంగానే వారిని తమకు విధేయులుగా మార్చుకోవడమూ జరుగుతున్నది. ఈ విధమైన కక్ష సాధింపులకు పాల్పడుతున్నందుకు ఇ.డి ని న్యాయస్థానాలు బహిరంగంగా మందలించిన సందర్భాలు అనేకం వున్నాయి.

ఏమైనా ఆర్‌ఎస్‌ఎస్ కు సుతిమెత్తని సత్కారమే లభిస్తున్నది. సంఘ్‌కు సమృద్ధిగా నిధులూ, స్థిరాస్తి వనరులూ వుండటం గురించి మోహన్ భగవత్‌ను ప్రశ్నించగా ఇవన్నీ తమ స్వయం సేవకులూ అధికారులూ స్వచ్ఛందంగా ఇచ్చినవేనని జవాబివ్వకుండా దాటేశారు. అయితే ఆయనే తమది వ్యక్తుల బృందమే తప్ప రిజిస్టరైన సంస్థ కాదంటున్నారు. కనుక ఈ వనరులన్నీ ప్రజల సంపద అవుతుందన్న వాస్తవాన్ని ఆయన దాచిపెడుతున్నారు. సంఘ్‌కు భారీ స్థాయిలో భూములున్నాయనేది ప్రజలకు తెలిసిన విషయమే. ఆ స్థలాల్లో ఆర్‌ఎస్‌ఎస్ భారీ సౌధాలు, ఇతర నిర్మాణాలు చేసింది. అయితే అది రిజిస్ట్రేషన్ లేని సంస్థ గనక ఇలాంటి ఆస్తుల గురించి ప్రజలకు వివరాలు ప్రకటించడమే జరగదు. ఆర్‌ఎస్‌ఎస్ గనక విశుద్ధ కపోతమే అయితే ఎందుకని దాపరికంగా వ్యవహరిస్తూ ప్రజల తనిఖీకి తన ఖాతాలను సమర్పించకుండా తప్పించుకుంటున్నది?

మత కలహాలు, విద్వేషాల మూలం

ఇక్కడ మనం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, చేసే పనులు, నిర్మాణ స్వరూపం వంటి విస్తృతాంశాల జోలికి పోనవసరం లేదు. దాని తప్పొప్పులు, అసత్య ప్రచారాల గురించి భారీ సమాచారం అందుబాటులో వుంది. పీపుల్స్ డెమోక్రసీ గత కొన్ని సంచికలలో కూడా మేము వివిధ సమస్యలలో, రంగాలలో ఆర్‌ఎస్‌ఎస్ చేసిందేమిటన్నదాన్ని చాలా వివరంగా విశ్లేషించాము. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకే విరుద్ధమైన దాని జోక్యాలను వివరించాము. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగంపై విశ్వాసం కలిగివుంటుందనీ, జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి జాతీయ చిహ్నాలను గుర్తిస్తుందనీ చెప్పడం పచ్చి వంచన మాత్రమే. సంఘ్ పూర్తి విరుద్ధమైన లక్ష్యాలతో అమలు చేస్తున్న మోసపూరిత ఆచరణ అది.

ఆర్‌ఎస్‌ఎస్ అద్భుత కృషి గురించి, దాని సేవల రికార్డు ఏమిటనేదానిపై మోడీ స్వయంగా ఎర్రకోట బురుజుల నుంచి స్వంత పూచీతో గర్జించారు. ఆర్‌ఎస్‌ఎస్ మతపరమైన హింసాకాండను రెచ్చగొట్టిందనీ, విద్వేషం రగిలించిందనీ ఆరోపణ వచ్చింది కేవలం దాని విమర్శకుల నుంచే కాదు. అయిదు తీవ్ర హింసాకాండలపై విచారణ జరిపిన విచారణ కమిషన్లు (1969లో అహ్మదాబాద్ మత కలహాలపై విచారణ జరిపిన జగన్మోహన్ రెడ్డి కమిషన్, 1970 భివాండి మత కలహాలపై డి.పి.మదన్ కమిషన్ నివేదిక, 1971 తలసెరి అల్లర్లపై జోసెఫ్ వితయతిల్ నివేదిక, 1979 జంషెడ్‌పూర్ అల్లర్లపై జితేంద్ర నారాయణ్ నివేదిక, 1982 కన్యాకుమారి మత కలహాలపై పి.వేణు గోపాలరెడ్డి నివేదిక) ఆర్‌ఎస్‌ఎస్ తో, దాని భావజాలంతో బలమైన అనుబంధంగల సంఘాలూ పార్టీలూ పోషించిన పాత్రను బహిరంగంగా అభిశంసించాయి. ముస్లింలు, ఇతర పౌరులకు అపార ప్రాణ బలికీ, ఆస్తి నష్టానికి దారితీసిన కలహాల ప్రజ్వలనకు వారెలా కారకులయ్యారో వెల్లడించాయి. వారి సేవా కార్యక్రమాల గురించి ఎలాంటి వాస్తవికమైన వివరాలు లేనప్పుడు వారి సహాయ కృషిపై ఆడిట్ తనిఖీ వంటివి లేకపోవడం ఊహించగలిగిందే.

> కులం, జాతి, తెగ, మతం వంటి తేడాలతో నిమిత్తం లేకుండా సాంస్కృతిక, భాషా వైవిధ్యాలు పాటించకుండా ప్రజలందరూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో కలసి పోరాడాలనే భావనకు కూడా ఆర్‌ఎస్‌ఎస్ తన ప్రతికూలతను పునరుద్ఘాటిస్తూ వచ్చింది. అందువల్ల బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతున్నందున తాము రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని చెప్పుకోవడం సత్యాన్ని పచ్చిగా తారుమారు చేయడమే అవుతుంది.

ఇప్పటికైనా చెప్పాల్సిందే!

చివరగా జాతి, జాతీయత గురించి సావర్కర్ రూపొందించిన నిర్వచనమే గోల్వాల్కర్ ఏమాత్రం విమర్శ లేకుండా స్వీకరించారు. మరింత లోతుగా బలపర్చాడు కూడా. భారత దేశం తమ మాతృభూమి, పితృభూమి అని గుర్తించేవారిని మాత్రమే అసలైన భారతీయులుగా గుర్తించాలన్నాడు. అంటే భారత దేశంలో వివిధ మత విశ్వాసాలకు చెందిన ప్రజలు, దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత కలిగివుంటూ తమ తమ మత విశ్వాసాలు అనుసరించే వారు భారతీయులనిపించుకోరనే ఆయన నిర్వచనం సూర్యకాంతిలా స్పష్టంగా అర్థమవుతూనే వుంది. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దృక్పథమే మన గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగానికి వ్యతిరేకంగా వుంది. అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్ ఏదో వ్యక్తుల బృందమనీ అందువల్ల రిజిస్ట్రేషన్ పరిధి వెలుపల వుండిపోతుందని మోహన్ భగవత్ చెప్పడం ప్రజల విజ్ఞతను అవమానించడమే అవుతుంది. అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్ సూటిగా ముందుకొచ్చి తన వ్యవహారాలేమిటో ప్రజలకు సమర్పించి తన అసలు సంగతులకు ఆమోదం పొందడం ఇప్పుడు తక్షణమే జరగాల్సిన పని.

(నవంబర్ 12 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఆదివాసీ యోధుడు బిర్సా ముండా

పి. అప్పలనర్స

నివాళి


భారత ఆదివాసీ చరిత్రలో బిర్సా ముండా పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది. 1875 నవంబర్ 15న జార్ఖండ్ లోని చోటానాగ్‌పూర్ ప్రాంతంలోని ఉలిహాట్ గ్రామంలో జన్మించిన బిర్సా ముండా బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా గొప్ప తిరుగుబాటు నడిపాడు. బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన 1878 అటవీ చట్టాలు, జమీందారులు, సాహుకారుల చేతుల్లోకి గిరిజన భూములు చేరడం వల్ల ఆదివాసీలు సంప్రదాయ భూ హక్కులు కోల్పోయారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి) నినాదంతో బిర్సా ముండా ఆదివాసీలను ఐక్యం చేశాడు. కేవలం పాతికేళ్ల వయసులోనే బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఎలా మరణించాడనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకపోయినా విషం ఇచ్చి జైల్లోనే చంపేశారని ఆదివాసీలు భావిస్తున్నారు. బిర్సా ముండా మరణించినా, ఆయన త్యాగం ఆదివాసీ హక్కుల పోరాటానికి శాశ్వత ప్రేరణగా నిలిచింది.

జన్ జాతీయ్ గౌరవ్ దివస్

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2021లో బిర్సా ముండా జయంతిని 'జన్ జాతీయ్ గౌరవ్ దివస్'గా ప్రకటించింది. ప్రతి ఏటా నవంబర్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

రాజ్యాంగ హామీలు-చట్టాల ఉల్లంఘన

భారత రాజ్యాంగం 5, 6వ షెడ్యూళ్ల ద్వారా ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు కల్పించింది. ఆంధ్రప్రదేశ్‌లో 1/70 చట్టం, జార్ఖండ్‌లో సంతాల్ కౌలుదారీ చట్టం, పెసా, అటవీ హక్కుల చట్టం 2006, ఎస్సీ-ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వంటివి ఆదివాసీ హక్కులను కాపాడతాయి. కానీ ఈ చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అడ్డుగా ఉన్నాయని, వీటిని బలహీనపరుస్తూ 2023 ఫారెస్ట్ కన్సర్వేషన్ అమెండ్‌మెంట్ యాక్ట్ తీసుకొచ్చారు. గ్రామసభ అనుమతి లేకుండానే అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. ఇన్ ప్రిన్సిపల్ అప్రూవల్ స్టేజ్-1 ద్వారా గ్రామసభకు సంబంధం లేకుండా కార్పొరేట్



నేడు జయంతి

కంపెనీలకు ఆమోదం లభిస్తుంది. ఇటీవల ప్రధానంగా బొగ్గు, ఇనుము, బాక్సైట్ మొదలగు మైనింగ్ తోపాటు హైడ్రో పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు భూమి కేటాయిస్తున్నారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పోర్టల్ ప్రకారం 5 లక్షల ఎకరాల అటవీ భూమిని కార్పొరేట్లకు కేటాయించారు. ఇందులో 23 శాతం మైనింగ్, బొగ్గు, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు. జార్ఖండ్‌లో 18,610 హెక్టార్లు, ఛత్తీస్‌గఢ్‌లో 4,431.91 హెక్టార్లు, ఎ.పి లో 10 వేల ఎకరాలు హైడ్రో పవర్ ప్రాజెక్టులకు కేటాయించారు. ఒరిస్సాలో అదానీకి కేటాయించిన ప్రాంతాల్లో 6 లక్షల చెట్లు నరికారు.

సాంస్కృతిక అస్తిత్వం-సర్నా మత గుర్తింపు నిరాకరణ

ఆదివాసీలు ప్రకృతి ఆరాధకులు. జల్, జంగిల్, జమీన్‌ను పూజిస్తారు. బిర్సా ముండా 1875-1900 మధ్య సర్నా మతాన్ని స్థాపించి, బ్రిటిష్ వలసవాదంపై పోరాటానికి ఆదివాసీలను ఐక్యం చేశాడు. 2011 జనాభా లెక్కలలో 50 లక్షల మంది "ఇతరులు" కాలమ్‌లో సర్నా ధర్మాన్ని రాశారు. జాతీయ ఎస్టీ కమిషన్ కూడా సర్నా ధర్మాన్ని స్వతంత్ర మత కేటగిరీగా గుర్తించాలని సిఫారసు చేసింది. కానీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ 'ఆదివాసీలు హిందూ మతంలో భాగమే' అంటూ సర్నాకు స్వతంత్ర మత గుర్తింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హిందూ మతాన్ని బలవంతంగా ఆదివాసీలపై రుద్దాలని ప్రయత్నం చేస్తున్నది. అందుకే "మాకు స్వతంత్ర మత కోడ్ కావాలి-హిందూ లేబుల్ కాదు" అని పలు ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మతపరమైన వివక్ష-హిందూ కేంద్రీకృత రాజకీయాలు

2025లో ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో 74 క్రైస్తవ వ్యతిరేక ఘటనలు నమోదయ్యాయి. ఆదివాసీ ప్రాంతాల్లో మత ఘర్షణలు పెరిగాయి. అనేక రాష్ట్రాల్లో సంఘపరివార్ శక్తులు మత ఘర్షణలను ప్రేరేపిస్తున్నారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్" నినాదానికి విరుద్ధంగా హిందూ కేంద్రీకృత రాజకీయాలను ప్రోత్సహించడం తగదు.

బిజెపి మరోపక్క ఆదివాసి ఉద్యమాలు, పోరాటాలను బలహీన పరచడం, ఆదివాసీల ఐక్యతను విచ్ఛిన్నం చేయడం ప్రధాన లక్ష్యంగా చేసుకొని, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నది. ఉదాహరణకు జార్ఖండ్ ముక్తి మోర్చా బలంగా ఉన్న ప్రాంతంలో ఆదివాసీ తెగల మధ్య ఉన్న వైరుధ్యాన్ని గుర్తించి, వివిధ రూపాల్లో ఐక్యతను విచ్ఛిన్నం చేసింది. విడిపోయినవారిని తన దగ్గర చేర్చుకోవడానికి బిజెపి కొన్ని సంక్షేమ పథకాలను ప్రకటించింది. మరోవైపు తెగల మధ్య చిచ్చు పెడుతున్నది.

ఆదివాసీల నిజమైన సమస్యలు-భూ హక్కులు, అటవీ హక్కులు, ఉపాధి, ఉద్యోగం, రిజర్వేషన్, ఆర్థిక వెనకబాటుతనం పరిష్కరించకుండా బిర్సా ముండా జయంతి పేరిట సాంకేతిక గౌరవం ప్రదర్శించడం సరికాదు. ఆదివాసీ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ, వారి దృష్టిని సాంస్కృతిక వేడుకలతో మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. ఆదివాసీలకు గౌరవంతో పాటు-హక్కులు కూడా కావాలి. బిర్సా ముండా ఆశయాలు నెరవేర్చే దిశలోనే నిజమైన గౌరవం ఉంటుంది.

/ వ్యాసకర్త గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, సెల్ : 9490300917 /

అసైన్డ్ చట్ట సవరణ ఎవరి కోసం?

విశ్లేషణ



వి. వెంకటేశ్వర్లు

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు దళితులు, బలహీన వర్గాల పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా వున్న 9/77 అసైన్ చట్టాన్ని ఈ నెల 10వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సవరించింది. ఈ చట్ట సవరణ బడుగు బలహీన వర్గాలకు వరం లాంటిదని, రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన కేంద్రంగా మార్చడంలో పేద రైతులు భాగస్వాములవుతారని, తద్వారా వచ్చే పరిశ్రమలలో పేద రైతుల పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని, మొత్తంగా పేదరికం లేని రాష్ట్రంగా ఎ.పి ని తీర్చిదిద్దుతామని రెవెన్యూ మంత్రి సెలవిచ్చారు. నిజానికి ఈ సవరణ వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం?


9/77 చట్టం (పిఓటి యాక్ట్) ఏం చెప్తున్నది?

ఎ.పి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ రకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 58 లక్షల ఎకరాలను పేదలకు అసైన్ చేశాయి. విభజిత ఆంధ్ర రాష్ట్రంలో 33 లక్షల 50 వేల ఎకరాలు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. పేదలకు ఇచ్చిన ఈ భూములను పెత్తందారులు, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు పేదలకు పావలో, పాతికో ఇచ్చి లేదా అదిరించి బెదిరించి లాక్కుంటున్నారు. అయితే పేదలకిచ్చిన భూములు పేదలే అనుభవించాలి. అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదు. అనర్హులు కొనడానికి వీలు లేదు. ఒకవేళ దౌర్జన్యంగా ఆక్రమించినా శిక్షార్హులని అసైన్‌మెంట్ సెక్షన్ 6 చెబుతున్నది. 1977లో పేదల కోసం పట్టుబట్టి పేదల ఆశాజ్యోతి ఎస్.ఆర్.శంకరన్ ఈ చట్టాన్ని తెచ్చారు. పేదల భూములకు రక్షణ కవచంగా ఉన్న ఈ చట్టాన్ని గత 20 సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ వచ్చాయి. దీనికి పరాకాష్టగా కూటమి ప్రభుత్వం గుండెకాయ లాంటి క్లాజుని సవరించింది. ఈ సవరణ వల్ల ఇప్పటికే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న పెత్తందారులకు 99 సంవత్సరాల లీజు పేరుతో భూములను కట్టబెట్టేందుకు పూనుకుంది.

1990కి ముందు మన దేశంలో వామపక్ష పార్టీల పోరాటాలతో పేదల చేతికి భూములు వచ్చాయి. వామపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలలో మాత్రమే భూసంస్కరణ చట్టాలు అమలు జరిగి పేదల చేతులలోకి కొద్దో గొప్పో భూములు వచ్చాయి. నాడు పేదలకు అనుకూలంగా భూ సంస్కరణలు, చట్టాలు వస్తే...1990 అనంతరం నూతన ఆర్థిక విధానాలతో పేదల భూములను పెద్దలకు కట్టబెట్టడానికి తిరోగమన సంస్కరణలు తెచ్చి...అభివృద్ధి అనే ముద్దు పేరుతో పేదల భూములను కార్పొరేట్లు, బడా పెట్టుబడుదారులకు లక్షల ఎకరాలు ధారాదత్తం చేస్తున్నాయి 'డబుల్ ఇంజన్' ప్రభుత్వాలు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 9/77 అసైన్ చట్టాన్ని సవరించారు.

మన రాష్ట్రంలో సుమారు 26 లక్షల కుటుంబాలకు 33 లక్షల 50 వేల ఎకరాలను పేదలకు ప్రభుత్వాలు పంచినట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. అయితే పేదలకు ఇచ్చిన ఈ భూముల్లో ఎక్కువ శాతం పెత్తందారులు, రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారి చేతుల్లోకి పోయినట్లు గతంలో కోనేరు రంగారావు భూకమిటీ చెప్పింది. ఇదే విషయాన్ని గత వైసిపి ప్రభుత్వం, నేటి టిడిపి కూటమి ప్రభుత్వాలు సైతం పలుమార్లు ప్రకటించాయి.

పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములు 20 సంవత్సరాల తర్వాత అమ్మకాలు, కొనుగోలు చేయవచ్చని గత వైసిపి ప్రభుత్వం అసైన్ చట్టాన్ని సవరించింది. ఆ సమయంలో సుమారు 7 లక్షల ఎకరాలను అనర్హులు అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నట్లు టిడిపి కూటమి ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను గుర్తించి, ఆక్రమించిన వారికి శిక్ష విధించి, తిరిగి పేదలకు పంపిణీ చేస్తామని 2024 మే లో జరిగిన అసెంబ్లీ



ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు వాగ్దానం చేశారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సార్లు రెవెన్యూ సదస్సులు పెట్టి కోట్ల రూపాయలు ఖర్చు చేసిందిగాని, ఒక్క ఎకరం కూడా పేదలకు పంచలేదు. భూ సమస్యలను అధ్యయనం చేయడానికి 2025 మార్చిలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారు. ఈ కమిటీ సుమారు 8 నెలలపాటు కసరత్తు చేసి అక్టోబర్ 7న సమావేశమై, త్వరలోనే రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ప్రకటించారు. రకరకాల పేర్లతో భూములు కోల్పోయిన పేదలందరూ ఈ ప్రకటన చూసి సంతోషించారు. తిరిగి పెత్తందారుల నుండి తమ భూములను ప్రభుత్వం తిరిగి వెనక్కి ఇప్పిస్తుందని ఆనందపడ్డారు. చావు కబురు చల్లగా చెప్పినట్లు టిడిపి కూటమి ప్రభుత్వం ఈనెల 10వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న అసైన్డ్ చట్టాన్ని సవరించి దళితులకు, బలహీన వర్గాల పేదల ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో అక్రమంగా దౌర్జన్యంగా పేదల నుండి ఆక్రమించుకున్న పెత్తందారులకే 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వడానికి చట్టాన్ని సవరించింది.

'అసైన్‌మెంట్ భూములు పేదల చేతులలోనే ఉండాలి. ఎట్టి పరిస్థితులలో అమ్మకాలు, కొనుగోలు చేయరాదు. భూబదలాయింపు నిషేధం' అన్న ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి... అనర్హులకు రాజమార్గం ద్వారా భూములను కట్టబెట్టడానికే కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరించింది. తద్వారా 26 లక్షల దళిత, బలహీన వర్గాల పేదలకు తీవ్ర ద్రోహం చేసింది.

/ వ్యాసకర్త ఎ.పి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

వేతన సంఘం నివేదికతో సంబంధం లేకుండా

వేతనాలు, అలవెన్స్‌లు అమలు చేయాలి

ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఎనిమిదో వేతన సంఘం నివేదిక జాప్యాన్ని నివారించే క్రమంలో 2026 జనవరి ఒకటి నుండి వేతన సంఘం నివేదికతో సంబంధం లేకుండా రైల్వే ఉద్యోగులకు వేతనాలు, అలవెన్స్‌లు అమలు చేయాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ జాయింట్ కన్సల్టేటివ్ మెషనరీ (ఎన్‌సిజెసిఎం) స్టాఫ్ సైడ్ సెక్రటరీ, ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివగోపాల్ మిశ్రా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ 55వ వార్షిక సాధారణ మండలి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, నాందేడ్ డివిజన్ల నుంచి రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకరరావుతో కలిసి మీడియాతో శివ గోపాల్ మిశ్రా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒత్తిడి మేరకు ఈ ఏడాది జనవరిలో 8వ వేతన సంఘం ఏర్పాటు చేసినా చైర్మన్ నియామకం, నియమ నిబంధనలు వంటివి పది నెలల తర్వాత ప్రకటించడంతో ఉద్యోగులకు ఆర్థికంగానూ, అలవెన్స్ రూపంలోనూ తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. వీటి నివారణకు వేతన సంఘం నివేదికతో సంబంధం లేకుండా ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు జనవరి ఒకటి నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక నాన్ కంట్రిబ్యూటరీ ఫండ్ పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కుగా కాకుండా ప్రభుత్వంపై ఏర్పడే ఆర్థిక భారం దృష్టితో చూస్తారని, ఇది రిటైర్డ్ ఉద్యోగులను, ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. రైల్వేల ఆధునీకరణను స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ఉద్యోగులపై అధిక పని భారం తగ్గించాలని, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. రైల్వేల భద్రతకు ఆటో సిగ్నలింగ్, కాంట్రాక్ట్ విధానం తీవ్ర ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రతకు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని, రైల్వే మంత్రులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సేవలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. హింద్ మజ్దూర్ సభ ఏపీ ప్రధాన కార్యదర్శి జి.ఎస్.శ్రీనివాసరావు, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రామారావు, ఎం.లీల, యూనియన్ ఏజిఎస్ జి.ఉదయ్ భాస్కరరావు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికత పెంచండి

- సుగంధ ద్రవ్యాల బోర్డు చైర్మన్ డాక్టర్ ఎబి రమాశ్రీ
- గుంటూరులో రెండు రోజుల సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి, ఇతర సుగంధ ద్రవ్యాల సాగులో రైతులు ఆధునిక మెళకువలు అవలంభించాలని జాతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు చైర్మన్ డాక్టర్ ఎబి రమాశ్రీ సూచించారు. అఖిల భారత సుగంధ ద్రవ్య ఎగుమతిదారుల ఫోరం సాంకేతిక భాగస్వామి వరల్డ్ స్పైస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు గుంటూరులో జరిగే 4వ జాతీయ సుగంధ ద్రవ్యాల సదస్సు తొలిరోజు శుక్రవారం స్థానిక వెల్కమ్ హోటల్‌లో ప్రారంభమయ్యింది. వివిధ దేశాల్లో అవలంభిస్తున్న సాగు మెళకువలను ఆమె వివరించారు. మిర్చితో పాటు అనేక రకాల సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఎగుమతులను సుస్థిరం చేసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సాగుపద్ధతుల్లో రైతులు ఎప్పటికప్పుడు మార్పులను గమనించాలన్నారు. వరల్డ్ స్పైస్ ఆర్గనైజేషన్ చైర్మన్ రామ్‌కుమార్ మీనన్ మాట్లాడుతూ మిర్చి సాగులో పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. తద్వారా వివిధ దేశాలకు ఎగుమతులు పెరుగుతాయన్నారు. అధిక పెట్టుబడి పెట్టినా సాగులో కొత్త మెళుకువలు పాటించకపోతే ఉపయోగం ఉండదని వివరించారు. అధిక దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో అనవసరంగా పురుగుమందుల వినియోగం చేయరాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుగంధ ద్రవ్యాలకు భారత్ నుంచి డిమాండ్ గణనీయంగా పెరుగుతున్న కీలక సమయంలో నాణ్యతతో కూడిన ఉత్పత్తుల స్థిరత్వంతో పాటు మార్కెటింగ్ మెళుకువలను కూడా తెలుసుకోవాలని సూచించారు. సైంటిఫిక్ ప్యానెల్ ఆఫ్ పెస్టిసైడ్స్ రెసిడ్యూస్ చైర్మన్ డాక్టర్ పరేష్ షా మాట్లాడుతూ ఉత్పత్తిదారుల అసోసియేషన్ ద్వారా వ్యవసాయ సాంకేతిక సంస్థలతో శిక్షణ ఉండాలన్నారు

రైతాంగంపై 'సీడ్‌బాంబ్'

(మొదటి పేజీ తరువాయి)

విత్తనాలు తప్పనిసరిగా కేంద్రప్రభుత్వ రిజిస్ట్రేషన్ పొందాలి. దానికోసం ఆయా కంపెనీలు మొలక శాతం, దిగుబడి సామర్థ్యం, వ్యాధి నిరోధకత, ఫీల్డ్ ట్రయల్ ఫలితాలు, ప్రయోగశాల పరీక్షా ధ్రువపత్రాలు అందజేయాలి.

- విత్తనం నాణ్యత రీత్యా లోపాలు ఉంటే, లేదా కంపెనీ చేసిన ప్రచారం ప్రకారం దిగుబడి రాకపోతే, రైతు నేరుగా పరిహారం కోరే హక్కు ఉంటుందని బిల్లులో పేర్కొన్నారు.
- కేంద్ర ప్రభుత్వం దేశానికి ఒకే విధమైన జాతీయ విత్తన ప్రమాణాలు రూపొందిస్తోంది. విత్తన రకాల కోసం స్వచ్ఛత శాతం, తేమ పరిమితి, మొలక శాతం, నిల్వ ప్రమాణాలు వంటి నిబంధనలు విధించింది.
- కొత్త విత్తనం మార్కెట్లో విక్రయించాలంటే కనీసం రెండు సాగు సీజన్లు ఫీల్డ్ ట్రయల్ తప్పనిసరి.

ఈ ట్రయల్స్‌లో వాతావరణాన్ని తట్టుకునే శక్తి, వ్యాధి నిరోధకత, నిజమైన దిగుబడి వంటివి పరీక్షిస్తారు. - అనుమతి లేకుండా లేదా ప్రమాణాలు లేకుండా విత్తనాలు విక్రయిస్తే భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు, గొడౌన్ సీజ్, అక్రమ స్టాక్ స్వాధీనం వంటి చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుందని పేర్కొన్నారు.

- రైతులు వ్యవసాయ భూముల్లో పండించి, నిల్వ ఉంచి, మార్పిడి చేసుకునే సంప్రదాయ విత్తన వ్యవస్థ ఈ చట్టం పరిధిలోకి రాదనీ, దానికి ఎలాంటి లైసెన్స్ అవసరం లేదని తెలిపారు.
- విత్తనాల దిగుమతి చేసేవారు తప్పనిసరిగా బయోసేఫ్టీ పరీక్షలు, క్వారంటైన్ ప్రక్రియ, నేషనల్ బ్యూరో ప్రమాణాలు అనుసరించాలి. జాతీయ భద్రత, జీవవైవిధ్య రక్షణను దృష్టిలో ఉంచుకొని నిబంధనలు రూపొందించామని పేర్కొన్నారు.
- విత్తన సరఫరా గొలుసుపై పర్యవేక్షించేందుకు దేశంలో విత్తన పంపిణీ, నిల్వ, రవాణ, విక్రయం వంటి వ్యవస్థలను కేంద్ర స్థాయిలో నియంత్రణ కమిటీ, రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తామని ముసాయిదాలో తెలిపారు.
- అలాగే విత్తనం ఏ ప్రాంతంలో ఉత్పత్తి అయిందో, ఏ కంపెనీ తయారు చేసిందో, ఎప్పుడు సర్టిపై అయిందో చెక్ చేసే "సీడ్ ట్రేసింగ్ సిస్టమ్"ను ఈ బిల్లు ప్రతిపాదించారు.

రెండేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన డేటా చట్టం

న్యూఢిల్లీ : రెండేళ్ల తర్వాత డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టంలో మెజారిటీ భాగాలను శుక్రవారం నోటిఫై చేశారు. 2017లో కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేసే దిశగా ఇదొక గణనీయమైన అడుగుగా కేంద్రం పేర్కొంది. గోప్యతా హక్కును ధృవీకరిస్తూ, భారతీయుల డేటాను పరిరక్షించుకునేందుకు చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని నాటి తీర్పులో సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. అలాగే జనవరిలో ముసాయిదా పంపిణీ చేసిన డిపిడిపి నిబంధనలు, 2025ను కూడా కేంద్రం నోటిఫై చేసింది. 2023 ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన ఈ చట్టం ప్రకారం సంస్థలు భారతీయుల డిజిటల్ డేటాను పరిరక్షించాల్సి వుంటుంది. అలాగే ప్రభుత్వం, దాని సాధనాలకు మాత్రం మినహాయింపులు ఇవ్వాల్సి వుంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలకు శిక్షలను నిర్దేశిస్తోంది. అయితే సమాచార హక్కు చట్టాన్ని కూడా ఈ చట్టం బలహీనపరుస్తోందని ఆర్‌టిఐ కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారి గోప్యతా హక్కు కన్నా ప్రజా ప్రయోజనాలే మిన్న అని పరిగణించాల్సిన పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారాన్ని కూడా అందచేయాల్సిన బాధ్యతను ప్రభుత్వ సంస్థల నుండి తొలగించారు. ఆ మేరకు సమాచార హక్కు చట్టాన్ని సవరించారు. ఈ సవరణ శుక్రవారం నుండే అమల్లోకి వచ్చింది.

ఆలస్యంగా వేసిన పంటలకు రబీలో ఇ-క్రాప్

- ప్రజాశక్తి కథనంపై వ్యవసాయ శాఖ జెడి వివరణ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఖరీఫ్ గడువు ముగిసిన తర్వాత ఆలస్యంగా సాగుచేసిన పంటలకు రబీలో ఇ-క్రాప్ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ కృష్ణా జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎన్.పద్మావతి తెలిపారు. సెప్టెంబరు 30లోపు వేసిన పంటలకు ఖరీఫ్-2025 ఈ పంట యాప్‌లో నమోదు చేశామని, అక్టోబరు 1 నుండి పంటలు వేసిన రైతులకు రబీకి సంబంధించిన ఇ-క్రాప్ యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. "ఈ క్రాప్‌కు కొర్రీ" శీర్షికన ఈనెల 14న ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కృష్ణా జిల్లా కోడూరు మండలంలో ఇ-క్రాప్ నమోదు పూర్తయిందని, 10,325 మంది రైతులకు చెందిన 17,308 ఎకరాల్లో పంట నమోదు చేశామని తెలిపారు. ఈ మండలంలో భూములు 22 ఎ (బి) జాబితాలో ఉన్న భూములు, ఇతర నిషేధిత భూముల రికార్డుల ఆధారంగా ఆయా ప్రభుత్వాధికారుల అనుమతి తీసుకుని ఖరీఫ్ పంటలకు ఇ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. కోడూరు మండలం దింటిమెరక రైతు గుమ్మడి సాంబశివరావు, శ్రీరాంపురంలో కొప్పనాటి బుల్లయ్య, రామకృష్ణాపురంలో పెదపూడి శేషయ్య పొలాల్లో ఇంకా పంట వేయలేదని తెలిపారు. అయితే పెదపూడి శేషయ్యకు కోడూరు గ్రామంలోని పొలానికి ఖాతా 1646లో 1.045 ఎకరాల్లో (ఇ-క్రాప్ బుకింగ్ ఐడిలు 312624599, 312624603, 312624595) ఇ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. కోడూరు మండలం రామకృష్ణాపురం, ఉల్లిపాలెం, కోడూరు తదితర గ్రామాలు, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లోని అనేక గ్రామాల్లో అక్టోబర్‌లో నాట్లు వేస్తారని, ఆ పంటలను రబీ ఇ-క్రాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. నిషేధిత భూముల్లో సాగు చేసిన పంటను కూడా సంబంధిత అధికారులు ధ్రువీకరించిన తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ అను మతి తీసుకుని ఇ-క్రాప్ నమోదు చేస్తామన్నారు.

దాళ్వాకు నీరివ్వాలని రోడ్డెక్కిన రైతులు

- జాతీయ రహదారిపై రాస్తారోకో

ప్రజాశక్తి - బంటుమిల్లి (కృష్ణాజిల్లా)



కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెందుర్రు వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

దాళ్వా వరి సాగుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామ సమీపంలో కత్తిపూడి - ఒంగోలు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 216)పై బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దాళ్వా సాగుకు నీరివ్వాలని, రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో పోలీసులు రాస్తారోకోను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు కదలబోమని రైతులు భీష్మించారు. పోలీసులు బంటుమిల్లి తహశీల్దార్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. తహశీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు రాస్తారోకో వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. సోమవారం నాటికి దాళ్వా సాగుపై స్పష్టత ఇవ్వకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. రైతుల ఆందోళనకు ఎపి రైతు సంఘం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు గోరిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై.నరసింహారావు మాట్లాడుతూ.. మొంథా తుపాను కారణంగా ఖరీఫ్ ఎకరాకు 15 బస్తాల వరకు దిగుబడి తగ్గిపోయిందని, ఇటువంటి పరిస్థితుల్లో దాళ్వాకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎపి రైతు సంఘం కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల కార్యదర్శులు కూనసాని రాంబాబు, లంకదాసుల అజయ్ ఘోష్ పాల్గొన్నారు.

విశాఖ రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్ట్ రైల్వే జోన్‌కు జోన్ గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్ శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త జోన్‌కు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని రైల్వే బోర్డును కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలన్నారు. నోటిఫికేషన్ కోసం సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. అధికారిక గెజిట్ లేకుండానే జీఎం నియమించారని, ఫలితంగా నాలుగు డివిజన్లు (విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, విశాఖపట్నం) రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షించే పరిపాలనా అధికారులు లేరని, జోన్ కోసం అధికారులను నియమించే ప్రక్రియ ఆలస్యమవుతుందని తెలిపారు.

టిటిడి మాజీ ఎవిఎస్‌ఒ సతీష్ మృతి అనుమానాస్పదం : వైసిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడి మాజీ ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదమని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని వైసిపి నాయకులు సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పరకామణి కేసులో సతీష్‌కుమార్‌ను విచారించిన సిట్ మళ్లీ విచారణకు రావాలని నోటీసు ఇచ్చిందని, ఫలితంగా ఇప్పుడు రైల్వేట్రాక్‌పై మృతదేహం కనిపించిందని అన్నారు. సతీష్‌కుమార్ మరణంపై అందరిలోనూ అనుమానాలు ఉన్నాయని, పోలీసుల వేధింపుల వల్లే ప్రాణాలు తీసుకున్నాడన్న వాదనలూ ఉన్నాయని తెలిపారు. సిట్ విచారణలో ఏం జరిగిందో కూడా తేలాల్సి ఉందని పేర్కొన్నారు. సతీష్‌కుమార్ సిట్ విచారణలో తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినట్లు ప్రచారం జరుగుతోందని, అయినా వేధించడం వల్లే బలవన్మరణానికి పాల్పడ్డాడని తిరుపతి ప్రజలు మాట్లాడుకుంటున్నారని అన్నారు. పరకామణిలో డాలర్ల చోరీ కేసులో అప్పటి టిటిడి ఛైర్మన్ భూమనను లాగేందుకు కుట్రచేసి ఆ విషయంలో సతీష్‌కుమార్‌పై తీవ్ర ఒత్తిడి చేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

టిటిడి ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం


ప్రజాశక్తి - తిరుమల



టిటిడి ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు విజయవాడకు చెందిన చక్కా మోనిష్ వెంకట సత్యప్రకాష్ కోటి రూపాయల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. చెక్కును దాత తరపున ప్రతినిధి భూషణ్ క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి ఇచ్చారు.

8 పర్యాయాలు సిఎం.. అసెంబ్లీ ఎన్నికలకు దూరం

జెడియు నేత నితీష్ కుమార్ విలక్షణత



పాట్నా : బీహార్‌కు ముఖ్యమంత్రిగా దాదాపు రెండు దశాబ్దాల పాటు పరిపాలిస్తున్న జెడియు అధినేత నితీష్ కుమార్.. ఈ సారి కూడా మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు 8 పర్యాయాలు ముఖ్యమంత్రిగా పని చేసిన ఆయన.. గత 35 ఏళ్లుగా శాసనసభ ఎన్నికల్లో మాత్రం పోటీ చేయలేదు. శాసనమండలి సభ్యులుగా ఉంటూనే ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతూ వస్తుండటం గమనార్హం. ఆయన చివరగా 1985లో హర్నౌట్ స్థానం నుంచి లోక్‌దళ్ పార్టీ ద్వారా ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1989, 1991, 1996, 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా ఐదు పర్యాయాలు బార్హ్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో బార్హ్, నలంద నుంచి పోటీ చేసిన ఆయన.. నలంద నుంచి విజయం సాధించారు. 1995లో హర్నౌట్ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు.

కీలకంగా మహిళా ఓటర్లు

దేశంలో జరిగే ఏ ఎన్నికలోనైనా గణనీయమైన ప్రభావాన్ని చూపే మహిళా ఓటర్లు.. బీహార్‌లోనూ కీలకంగా మారారు. ఇక్కడి మహిళా ఓటర్లను ఆకర్షించడంలో అధికార ఎన్డీఏ కూటమి విజయం సాధించిందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ముఖ్యంగా రోజ్‌గార్ యోజన కింద మహిళా సాధికారత పేరుతో ఏకంగా 21 లక్షల మంది మహిళలకు రూ.10 వేలు చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, అందునా ఎన్నికలకు కొద్ది రోజుల ముందుగా నగదు బదిలీ చేయడం ఎన్‌డిఎ విజయానికి బాగా పనిచేసిందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తానికి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్‌డిఎ చేసిన ప్రయత్నాలు విజయవంతం కావటంతో అవే ప్రణాళికలను బీహార్‌లోనూ ప్రయోగించిందని విశ్లేషకులు చెప్తున్నారు.

ఎంఐఎం ఐదు స్థానాల్లో..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ చర్చనీయాంశంగా మారుతున్న ఎంఐఎం.. ఈ సారి కూడా ఐదు స్థానాల్లో విజయం సాధించింది. మైనారిటీ ఓట్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో దృష్టి కేంద్రీకరించిన ఈ పార్టీ అధికార, ప్రతిపక్ష కూటముల ఓట్లను చీల్చటంలో విజయం సాధించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కాగా ఎంఐఎం నుంచి గతంలో విజయం సాధించిన ఎమ్మెల్యేలు ఆర్జేడీకి పార్టీ ఫిరాయించిన విషయం విదితమే.

పని చేయని ప్రశాంత్ కిషోర్ వ్యూహం

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరున్న ప్రశాంత్ కిషోర్.. జన్ సురాజ్ పార్టీ (జెఎస్‌పి)ని స్థాపించి బీహార్ ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఆయన పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపలేపోయింది. సొంత నియోజకవర్గంలోనూ ఆయన వ్యూహాలు పని చేయలేదు. దీంతో ఆ పార్టీ ఖాతా తెరవక చతికిలపడిపోయింది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించిన విషయం విదితమే. ఈనెల 6న మొదటి దశ, 11న రెండో దశలో ఎన్నికలు జరిగాయి. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యాన్ని 14న ఓట్ల లెక్కింపు ద్వారా అధికారులు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఆర్‌జెడి జనబలం



ఈ ఎన్నికల్లో ఆశించినస్థాయిలో సీట్లను దక్కించుకోలేకపోయిన ఆర్‌జెడి.. మిగతా పార్టీలకంటే ఎక్కువ ఓట్లను పొందింది. ఆ పార్టీకి 22.94 శాతం ఓట్లు వచ్చాయి. ఇక ఎన్‌డిఎలోని బిజెపికి 20 శాతం, జెడియుకు 19 శాతం ఓట్లు దక్కాయి. కాంగ్రెస్ మాత్రం 8 శాతానికి పరిమితమైంది. ఎల్‌జెపి(ఆర్‌వీ) 5 శాతం ఓట్లను దక్కించుకున్నది. ఎంఐఎం 1.86 శాతం ఓట్లను పొందింది. ఆర్‌జెడి 2005 నుంచి (మధ్యలో కొన్నినెలలు మినహాయిస్తే) అధికారానికి దూరంగా ఉన్నది.

గతంతో పోలిస్తే సగం కూడా రాలేదు..

ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ నేతృత్వంలో ముందుకెళ్లిన మహాగట్బంధన్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. కూటమిలో కీలక పార్టీగా ఉన్న ఆర్జేడీ 25 స్థానాల్లోనే విజయం సాధించింది. కాంగ్రెస్ ఆరు నియోజకవర్గాలకే పరిమితమైంది. ఈ కూటమిలోని వామపక్ష పార్టీలు మూడు సీట్లను చేజిక్కించుకున్నాయి. సిపిఎం ఒక స్థానాన్ని, సిపిఐ (ఎంఎల్ – లిబరేషన్) రెండు సీట్లను దక్కించుకున్నాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మహాగట్బంధన్ 114 స్థానాల్లో విజయం సాధించగా.. ఈ సారి అందులో సగం కూడా దక్కించు కోకపోవడం గమనార్హం.



ఢిల్లీలోని శాంతివనంలో నెహ్రూ స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న ఖర్గే, సోనియా తదితరులు

నెహ్రూ సేవలను తుడిచిపెట్టేందుకు చూస్తున్నారు !

- ప్రధాని మోడీపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ : ఆధునిక భారతాన్ని నిర్మించేందుకు జవహర్‌లాల్ నెహ్రూ అందించిన అపారమైన, విశేష సేవలను ఈనాడు ప్రధాని నరేంద్ర మోడీ నిరాకరిస్తున్నారని, అవమానిస్తున్నారని, వక్రీకరిస్తున్నారని, రాక్షసంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది. తన వారసత్వంపై జరుగుతున్న ఈ దాడి నుండి భారత దేశ తొలి ప్రధాని బయటపడాలని, బయటపడతారని పేర్కొంది.

దేశ 20వ శతాబ్దపు చరిత్ర నుండి నెహ్రూను తుడిచిపెట్టాలని ఎవరైతే కోరుకుంటున్నారో వారిలోని అభద్రతలు, భయాలు ఈ రకంగా ప్రతిబింబిస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. నెహ్రూ 136వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రధాని మోడీ ప్రభుత్వంపై ఈ వ్యాఖ్యలు చేసింది. ఇక్కడ శాంతివనంలోని నెహ్రూ మెమోరియల్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ సోనియా గాంధీలు పుష్పాంజలి ఘటించారు. నెహ్రూ వారసత్వం కలకాలం దిక్సూచిలా నిలిచి వుంటుందని చెప్పారు. భారతదేశం గురించి ఆయన ఆలోచనలు, విలువలనేవి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం వీటిల్లో ప్రతిబింబిస్తాయన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ, స్వతంత్ర భారతంలో రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలకు నెహ్రూ పునాది వేశారని కొనియాడారు. తన దార్శనికత, నిర్భయంతో కూడిన ఆయన నాయకత్వం వల్లనే ఇదంతా సాధ్యమైందని, దేశానికి సరికొత్త దిశా నిర్దేశం అందించగలిగారన్నారు. ఈనాటికీ ఆయన విలువలు, ఆదర్శాలు మనకు స్ఫూర్తి కలిగిస్తూనే వుంటాయన్నారు.

ఢిల్లీ పేలుళ్ల నిందితుడు ఉమర్ నబీ ఇల్లు పేల్చివేత



ప్రభుత్వ అధికారులు పేల్చివేసిన అనంతరం శిథిలాల కుప్పగా మిగిలిన ఉమర్ నబీ ఇల్లు

శ్రీనగర్ : దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న జరిగిన పేలుళ్లకు కారణమైన కారుని నడిపిన వ్యక్తిగా గుర్తించిన డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని పుల్వామాలో అధికారులు పేల్చివేశారు. గురువారం రాత్రి పేలుడు పదార్థాలు ఉపయోగించి ఈ ఇంటిని ధ్వంసం చేశారు. పుల్వామాలోని కోయిల్ వద్ద నబీ కుటుంబం నివసించేదని, రాత్రి భద్రతా బలగాలు వచ్చి ఆ ఇంటిని పేలుడు పదార్థాలతో పేల్చివేశాయని స్థానికులు తెలిపారు. ఆ పేలుడు జరిగిన సమయంలో కుటుంబ సభ్యులెవరూ అక్కడ లేరు. ఈ పేలుడుతో నబీ ఇల్లు శిథిలాల కుప్పగా మారిందని, కానీ ఆ పేలుళ్ళ ధాటికి సమీపంలోని అనేక ఇళ్ళు కూడా కొంతమేరా దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. కాగా జమ్మూ కాశ్మీర్ పోలీసులు ఈ సంఘటనపై ఎలాంటి ప్రకటన చేయలేదు. నబీ బంధువులు కూడా దీని గురించి మీడియాతో మాట్లాడేందుకు తిరస్కరించారు.

ఇదిలావుండగా, కాశ్మీర్ ముఖ్య పండితుడు మీర్వాయిజ్ ఉమర్ ఫరూక్ శుక్రవారం మాట్లాడుతూ, కాశ్మీర్ పట్ల ప్రభుత్వ దృక్పథంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. జమ్మూ కాశ్మీర్ ప్రజలను భద్రత, శాంతి భద్రతల కోణం నుండే చూడాలని కోరారు. చర్చలు జరపాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఒకరు చెప్పింది మరొకరు వినాలని, ఇరు పక్షాలు మాట్లాడుకోవాలని, అప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలుగుతామని సూచించారు.

తొలి ఆరోగ్యహిత పర్యావరణ ప్రణాళిక

- కాప్ సదస్సులో బ్రెజిల్ ప్రతిపాదన



ఆరోగ్య హిత పర్యావరణ ప్రణాళిక గురించి వివరిస్తున్న బ్రెజిల్ ఆరోగ్య మంత్రి అలెగ్జాండర్ పదిల్లా

బెలెమ్ : ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రధాన దృష్టి కేంద్రీకరిస్తూ ప్రప్రథమంగా ఆరోగ్య హిత పర్యావరణ కార్యాచరణ ప్రణాళికను బ్రెజిల్ ప్రతిపాదించింది. పర్యావరణ పరిరక్షణ కోసం బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరుగుతున్న భాగస్వామ్య పక్షాల సదస్సు (కాప్ 30)లో ఈ మేరకు ప్రత్యేక నివేదికను ఆతిథ్యం దేశం సమర్పించింది. వాతావరణ మార్పుల వల్ల తలెత్తే ప్రభావాలకు వ్యతిరేకంగా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలను బలోపేతం చేయడానికి నిర్దిష్ట చర్యలను బ్రెజిల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆ ప్రణాళికలో ప్రతిపాదించింది. ముఖ్యంగా ఇటువంటి దాడులకు గురయ్యే తరగతులపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని ఉద్ఘాటించింది. వాతావరణం, ఆరోగ్య డేటాను పర్యవేక్షించడం, విపత్తులు ఎదురైనా వాటిని తట్టుకునేలా ఆర్యోగ రంగంలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం, దుర్బలమైన కమ్యూనిటీల పట్ల సంరక్షణ కొనసాగిం చడం ఈ మూడు అంశాల వారీగా ప్రణాళిక అమలు చేయాల్సి వుంటుందని ప్రతిపాదించింది. బ్రిటన్, ఈజిప్ట్, అజర్‌బైజాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లతో సహా పలు దేశాలతో కలిసి బ్రెజిల్ ఈ ప్రణాళికను రూపొందించిందని బ్రెజిల్ ఆరోగ్య మంత్రి అలెగ్జాండర్ పదిల్లా చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టే ఈ ప్రణాళిక చాలా దేశాలకు తక్షణ మనుగడకు సంబంధించిన అంశమని మంత్రి కాప్ సదస్సులో స్పష్టం చేశారు.

సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన

(మొదటి పేజీ తరువాయి)

విశాఖను అభివర్ణించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కోసం అత్యంత పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారత్ తీసుకువచ్చిన డిజిటల్ పేమెంట్ విధానాన్ని ఇప్పుడు ప్రపంచం మొత్తం అనుసరిస్తోందన్నారు. 30 మిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నామని, 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకుంటున్నట్లు వివరించారు.

రాష్ట్రంలో ఎనిమిదోసారి జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయన్నారు. కొన్ని నెలలుగా రాష్ట్రంలో మౌళికాభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విమానాశ్రయాలు అంతర్జాతీయ ప్రమాణాలతో సాగుతున్నాయని, ప్రస్తుతం ఏడు ఆపరేషనల్ ఎయిర్‌పోర్టులు ఉంటే కొత్తగా మరో ఏడు విమానాశ్రయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఏరో స్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాలను కూడా రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత రాధాకృష్ణన్‌ను రాష్ట్రపతిగా పేర్కొన్నారు. అయితే తరువాత సరిదిద్దుకుని ఉప రాష్ట్రపతిగా సంబోధించారు.

మళ్లీ ఎన్‌డిఎ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అభివృద్ధికి దక్కిన విజయంగా కొనియాడారు. కాగా ఓట్ల లెక్కింపునకు ముందు రోజు ఈ నెల 13న ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలు పనిచేయకపోవడం, పెద్ద పెట్టెలతో కూడిన భారీ ట్రక్కులు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మోహరించడం వంటి ఘటనలపై ఆర్‌జెడి అధినేత తేజస్వీ యాదవ్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అభివృద్ధికి జై కొట్టిన ఓటర్లు : మోడీ

పాట్నా : బీహార్‌లో ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టారని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్ర ప్రజలు తమ కూటమికి అఖండ విజయం అందించారని చెప్పారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింలు, యాదవ్‌లు అని కొన్ని రాజకీయపార్టీలు సంతుష్టీకరణ రాజకీయాలు చేశాయన్నారు. అయితే ఎన్డీఏ విజయానికి మహిళలు, యువత బాసటగా నిలిచారని ఆయన చెప్పారు. బీహార్‌లో విజయం కోసం పని చేసిన ఎన్డీఏ నేతలు, సీఎం నితీశ్ కుమార్ నాయకత్వాన్ని ప్రధాని ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు చెప్పారనీ, బీహార్ ప్రగతికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తిని ఇస్తుందని అంతకుముందు ఎక్స్ వేదికగా మోడీ స్పందించారు.

మూడు లక్షల మంది ఓటర్లు ఎక్కడి నుంచి వచ్చారు

- సిపిఐ (ఎంఎల్ - లిబరేషన్) ప్రశ్న

పాట్నా : బీహార్‌లో అనూహ్యంగా ఓటర్ల సంఖ్య పెరిగిందని... దీనికి ఎన్నికల సంఘం సహకరించడం వల్లే ఎన్‌డిఎ కూటమి విజయం సాధ్యమైందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచర్య పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్‌ఐఆర్) చేపట్టిన తర్వాత ఓటర్ల సంఖ్య కంటే.. ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య మూడు లక్షలు పెరిగింది. అంత మంది ఓటర్లు ఎక్కడి నుంచి ఎలా వచ్చారని ఆయన ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు.

బీహార్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ తర్వాత 7.42 కోట్ల ఓటర్ల జాబితా ఉంది. అయితే ఎన్నికల తర్వాత ఈ సంఖ్య 7,45,26,858గా ఉందని ఎన్నికల సంఘం నవంబర్ 11న మీడియా సమావేశంలో పేర్కొంది. ఎస్‌ఐఆర్ జాబితాకు.. ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్యలో తేడా ఉంది. ఎన్నికల్లో మూడు లక్షల ఓట్లు ఎలా పెరిగాయి? అని ఆయన ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు.

మహిళలకు పదివేలు పంపిణీ చేసినా ఇసి మౌనంగా ఎందుకుంది? : అశోక్ గెహ్లాట్


పాట్నా : బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి 200కి పైగా స్థానాల్లో గెలుపొందే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌డిఎ గెలుపొందడానికి ఎన్నికల సంఘం పరోక్షంగా సహకరించింది అని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన (ఎంఎంఆర్‌వై) పథకం కింద మహిళా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్స్‌లో పదివేల రూపాయలను నితీష్ కుమార్ ప్రభుత్వం జమ చేసింది. అప్పుడు కూడా ఎన్నికల సంఘం మౌన ప్రేక్షకుడిలా వ్యవహరించింది? పదివేల పంపిణీ చేసినా ఇసి ఎందుకు ఆపలేదు అని గెహ్లాట్ ప్రశ్నించారు.

ఎస్‌ఐఆర్ వల్లే ఎన్‌డిఎ కూటమి గెలుపు : కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్

పాట్నా: బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి గెలుపొందేందుకు ఎస్‌ఐఆర్ ఓ కొత్త ఆయుధమని కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఎస్‌ఐఆర్ ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం 60 లక్షల మంది ఓటర్లను తొలగించింది. మొత్తం ఓటర్లలో 10 శాతం ఓటర్లను తొలగించారు. ఇందులో ఎక్కువమంది ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లే. ఎన్నికలకు ముందే ఎస్‌ఐఆర్ అనేది ఓటు చోరీ మాధ్యమంగా మారింది. కేవలం ఎస్‌ఐఆర్ వల్లే ఈ ఎన్నికల్లో జెడియు, బిజెపిలు గెలుస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ఎస్‌ఐఆర్ ఒక పెద్ద ఆయుధం. బీహార్‌లో ప్రతి ఒక్కరూ మార్పును కోరుకుంటున్నారు. కానీ అది ఎన్నికల్లో ఎందుకు కనిపించదు? ఎందుకంటే.. ఎన్నికల కమిషన్ అమ్ముడుపోయింది. అది బిజెపితో కలిసి పనిచేస్తోంది అని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

మూడు నియోజకవర్గాల్లో లెఫ్ట్ గెలుపు..

- బిభూదిపూర్‌లో సిపిఎం, రెండు నియోజకవర్గాల్లో లిబరేషన్ గెలుపు
- అజియోన్‌లో 95 ఓట్లతో గెలిచిన బిజెపి



అజయ్ కుమార్ | అరుణ్ సింగ్ | సందీప్ సౌరవ్

పాట్నా : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 3 నియోజకవార్గాల్లో లెఫ్ట్ అభ్యర్థులు గెలిచారు. సిపిఎం బిభూదిపూర్ నియోజకవర్గంలో 10,281 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఉజియార్పూర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బిభూదిపూర్ అసెంబ్లీ స్థానంలో సిపిఎం అభ్యర్థి 55 ఏళ్ల అజయ్ కుమార్ 10,281 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జెడియూ పార్టీ అభ్యర్థి రవీనా కుష్వాహాకి 68,965 ఓట్లు రాగా, అజయ్‌కుమార్‌కు 79,246 ఓట్లు వచ్చాయి. మరో స్వతంత్ర అభ్యర్థి రూపాంజలీ కుమారి 14,456 ఓట్లు సాధించారు. కుష్వాహా కమ్యూనిటి ఆధిపత్యం ఉన్న ఈ స్థానంలో సిపిఎం రెండోవసారి గెలిచింది. 2020 ఎన్నికల్లో అజయ్ కుమార్ 40,496 వేల మెజార్టీతో గెలుపొందారు. ఈ సెగ్మెంట్‌లో సిపిఎం 4సార్లు గెలిచింది. న్యాయవాది అయిన అజయ్ కుమార్ కార్మికులు, రైతుల పక్షాన అనేక పోరాటాలను నిర్వహించారు. పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులుగా పని చేస్తున్న అజయ్ కుమార్ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేవారని, అందుకే ఇంత ఎన్‌డిఏ వేవ్‌లో కూడా ఆయన గెలిచారని పలువురు భావిస్తున్నారు.. సిపిఎం తరుపున ఇతర ప్రాంతాల్లో పోటీచేసిన స్థానాల్లో గణనియమైన ఓట్లను ఆపార్టీ సాధించింది. పిప్రా అసెంబ్లీ స్థానంలో సిపిఎం అభ్యర్థి రాజమంగల్ ప్రసాద్‌కు 99,677 ఓట్లు వచ్చాయి. హయాఘాట్‌లో సిపిఎం అభ్యర్థి శ్రామ్ భారతి 65,383 ఓట్లను పొందారు. మాంఝిలో డాక్టర్ సతేంద్ర యాదవ్ 58,668 ఓట్లను పొంది ప్రత్యర్థి రణధీర్ కుమార్ సింగ్‌కు గట్టి పోటీ ఇచ్చారు. సిపిఎం(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నుండి సందీప్ సౌరవ్ పాలీగంజ్ నియోజకవర్గంలో 6,655 మెజార్టీతో, కరకట్‌లో అరుణ్ సింగ్ 2,836 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అజియోన్ నియోజకవర్గంలో కేవలం 95 ఓట్లతో లిబరేషన్ అభ్యర్థి శివ ప్రకాష్ రంజన్‌పై బిజెపి అభ్యర్థి మహేశ్ పాశ్వాన్ గెలుపొందటం గమనార్హం. మొత్తం లెఫ్ట్ పార్టీలకు 4.22% ఓట్లు వచ్చాయి.

ఎన్నికలు న్యాయంగా జరగలేదు

- ఫలితాలపై లోతుగా చర్చిస్తాం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు మరింత కృషి : రాహుల్



న్యూఢిల్లీ : బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందించారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి కూడా న్యాయంగా జరగలేదనీ, అందుకే విజయం సాధించలేకపోయామని ఆరోపించారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా వచ్చాయని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. ఫలితాలపై కాంగ్రెస్, ఇండియా బ్లాక్ లోతైన సమీక్ష జరుపుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము మరింతగా కృషి చేస్తామని వివరించారు. మహాగట్‌బంధన్ కూటమి పట్ల విశ్వాసం ఉంచిన లక్షలాది మంది బీహార్ ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం : ఖర్గే

బీహార్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే శక్తుల పట్ల తాము పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాలపై సమగ్ర అధ్యయనం జరుపుతామని వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రజల్లో ఉంటూ.. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మన పోరాటం కొనసాగుతుందని వివరించారు. తమ పోరాటం నిబద్ధతతో కూడుకొని ఉంటుందని పేర్కొన్నారు.


ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి చెరో రెండు స్థానాల్లో గెలుపు

న్యూఢిల్లీ : బీహార్ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాలో 8 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాల్లోనూ, బిజెపి రెండు స్థానాల్లో విజయం సాధించాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్, రాజస్థాన్‌లోని ఆంటా స్థానంలో కాంగ్రెస్ గెలుపొందగా...జమ్ముకాశ్మీర్‌లోని నాగ్రోటాలోనూ, ఒరిస్సాలోని నౌపాడాలోనూ బిజెపి విజయం సాధించింది. మిగిలిన చోట్ల ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు గెలుపొందాయి. కడపటి సమాచారం ప్రకారం ఫలితాలు ఇలా వున్నాయి.

- తెలంగాణలోని జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24729 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక్కడ బిజెపికి డిపాజిట్ కూడా దక్కకపోవడం గమనార్హం.
- రాజస్థాన్‌లోని ఆంటాలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రమోద్ జైన్ భయ్యా ..బిజెపి అభ్యర్థి మోర్పాల్ సుమన్‌పై 15000 పై చిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- జమ్ముకాశ్మీర్‌లోని బడ్గామ్ అసెంబ్లీ స్థానంలో పిడిపి అభ్యర్థి అగా సయ్యద్ ముంతజిర్ మెహ్ది.. నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి అగా సయ్యద్ మహ్మద్ అల్ మోసావిపై 4478 ఓట్లతో తేడాతో విజయం సాధించారు. నాగ్రోటా అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి దేవ్‌యాని రానా ..జెకెఎన్‌పిపి అభ్యర్థి హరీష్ దేవ్ సింగ్‌పై 42350 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- జార్ఖండ్‌లోని ఘాట్శిలాలో జెఎంఎం అభ్యర్థి సోమేశ్ చంద్ర సోరేన్.. బిజెపి అభ్యర్థి బాబులాల్ సోరేన్‌పై 38601 ఓట్ల మెజారిటీతో సోమేశ్ గెలుపొందారు.
- పంజాబ్ (తర్న్ తారన్)లో ఆమాద్మీ పార్టీ (ఆప్) అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధూ.. శిరోమణి అకాలీ దళ్ అభ్యర్థి సుఖ్విందర్ కౌర్‌పై 12091 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- మిజోరాంలోని డంపాలో మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) అభ్యర్థి, మాజీ మంత్రి ఆర్ లాల్‌థంగ్లియానా.. జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెపిఎం) అభ్యర్థి వన్లాల్ సాయిలోవా పై 562 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- ఒరిస్సాలోని నౌపాడాలో బిజెపి జై ధోలాకియా.. కాంగ్రెస్ అభ్యర్థి ఘంసీ రామ్ మంఝిపై విజయం సాధించారు.

పరకామణి కేసులో ఏకైక సాక్షి, నిందితుడు అనుమానాస్పద మృతి

- తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్‌పై మృతదేహం లభ్యం
- ఇది హత్య అంటూ మృతుని సోదరుడు ఆరోపణ



సతీష్‌కుమార్ మృతదేహం

ప్రజాశక్తి– తిరుపతి బ్యూరో, తాడిపత్రి రూరల్ (అనంతపురం జిల్లా)

పరకామణి కేసులో కీలక సాక్షి, నిందితుడు, టిటిడి మాజీ ఎవిఎస్‌ఒ సతీష్‌కుమార్ (52) అనుమానాస్పదంగా శుక్రవారం మృతి చెందారు. శుక్రవారం ఉదయం తాడిపత్రి–గుత్తి ప్రధాన రైల్వే రహదారిలోని కోమలి జూటూరు రైల్వేస్టేషన్ల అప్‌డౌన్ ట్రాక్‌ల మధ్య విగత జీవుడై ఉన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో జిఆర్‌పి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆయన పరకామణి కేసులో విచారణ నిమిత్తం గురువారం రైల్లో తిరుపతికి బయల్దేరినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఐజి షిమోషీ, ఎస్‌పి జగదీష్, రైల్వే పోలీసులు పరిశీలించారు. గుత్తి సిఆర్‌పి సిఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ కొనసా గుతోంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. 2023 ఏప్రిల్‌లో తిరుమలలో పరకామణి సందర్భంగా విదేశీ డాలర్లను దొంగతనం చేస్తుండగా పరకామణి ఉద్యోగి రవికుమార్‌ను అప్పట్లో టిటిడి ఎవిఎస్‌ఒగా ఉన్న సతీష్‌కుమార్ పట్టుకొని తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఆ తర్వాత ఈ కేసు లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యింది. కొందరు వైసిపి నాయకులు, టిటిడి ఉన్నతాధికారులు, పోలీసుల ఒత్తిడి ఇందుకు కారణమని, రాజీ వ్యవహారంలో సతీష్‌కుమార్ కీలకంగా వ్యహరించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరకామణి కేసును తిరగదోడింది. సతీష్‌కుమార్‌పైనా కేసు పెట్టింది. ఈ కేసులో ఆయనే కీలక సాక్షిగా కూడా ఉన్నారు. సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ బృందం కేసు దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల ఆరున సతీష్‌కుమార్‌ను తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో విచారించింది. ఈ నెల 14న (శుక్రవారం) మరోసారి విచారణకు రావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి కలకలం సృష్టించింది. టిటిడిలో సంచలనంగా మారిన పరకామణి కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నందునే కేసును తారుమారు చేయడానికి హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సతీష్‌కుమార్ స్వస్థలం కర్నూలు జిల్లా పత్తికొండ.

హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారు : మృతుని సోదరుడు

తన అన్నను హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారని, ఇది ముమ్మాటికి హత్యే అని మృతుడు సతీష్ కుమార్ తమ్ముడు హరి ఆరోపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సిబిఐతో దర్యాప్తు జరిపించాలి : ఎమ్మెస్ రాజు

ఈ మృతిపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని టిటిడి పాలకమండలి సభ్యులు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు ప్రభుత్వాన్ని కోరారు. పరకామణి చోరీ కీలక పాత్రధారులు, సూత్రధారులు ఈ కేసు నుండి బయటపడేందుకు కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్‌ను హత్య చేసి, తాడిపత్రిలోని రైల్వే ట్రాక్ పై మృతదేహాన్ని పడేశారని ఆరోపించారు.

సమగ్ర విచారణ జరపాలి : సిఐటియు

సతీష్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, హత్యా లేదా ఆత్మహత్య అనేది ప్రజలకు తెలియజేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కోరారు. పరకామణి అవినీతి వ్యవహారంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ముందు నుంచి కోరుతున్నామని పేర్కొన్నారు.

ఇది వైసిపి పనే : శాప్ చైర్మన్ రవినాయుడు

పరకామణి చోరీ కేసును పక్కదారి పట్టించేందుకు, అసలు నిందితులను కాపాడేందుకు వైసిపి కుట్రపన్ని సతీష్‌కుమార్‌ను అత్యంత కిరాతకంగా హత్య చేసి రైల్వే ట్రాక్‌పై పడేసిందని శాప్ చైర్మన్ రవినాయుడు ఆరోపించారు. కల్తీ నెయ్యి, పరకామణి కేసుల్లో ఇతర సాక్ష్యులకు పోలీసులు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇది ప్రభుత్వ హత్యే : భూమన కరుణాకర్‌రెడ్డి

ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే. పరకామణి కేసులో రెండు నెలలుగా సతీష్‌కుమార్‌ను వేధించడంతో ఈ బతుకు నాకెందుకంటూ సహచరులకు చెప్పి బాధపడ్డాడని తెలిపారు. సతీష్‌కుమార్ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

సతీష్‌కుమార్ మృతదేహానికి పోస్ట్‌మార్టం పూర్తి హత్యగా అనుమానం

సతీష్‌కుమార్ మృతదేహానికి అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో ఫొరెన్సిక్, పోలీసుల పర్యవేక్షణలో పోస్ట్‌మార్టం పూర్తయింది. మృతదేహంపై వెనుకవైపు మాత్రమే గాయాలు ఉండడంతో ఇది హత్యగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. రైల్లోనే సతీష్‌కుమార్ తల వెనుక బలంగా కొట్టి కిందకు తోసేసినట్టు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి రెండు నుంచి మూడు గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. అనంతపురం చేరుకున్న సిఐడి డిజి రవిశంకర్ పోలీసు గెస్ట్ హౌసులో అధికారులతో సమీక్షించారు. ఎసి బోగిలోని ప్రయాణికుల జాబితాను రప్పించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా లేక ముందుకు సాగిపోవడమా అనేది మనం వేసే అడుగులోనే ఉంటుంది.

మీ కోసం

బంగాళదుంప వేపుడు చేసేటప్పుడు ఉప్పునీళ్లలో ముక్కలను ఓ అరగంట నానబెడితే కూర రుచిగా ఉంటుంది.



కాకి దుర్బుద్ధి



ఒక అడవిలో ఒక చెట్టు మీద కాకి గ్రద్ద నివాసం ఉంటున్నాయి. కాకి అడవి దగ్గర్లో ఉన్న గ్రామాలకు వెళ్లి ఆహారం సేకరించుకునేది. ఒక్కో రోజు కాకికి ఆహారం దొరకడం చాలా కష్టంగా ఉండేది. అలాంటి పరిస్థితుల్లో ఆకలితో పస్తులు ఉండాల్సి వచ్చేది. గ్రద్ద మాత్రం వారానికి ఒకసారి మాత్రమే ఆహారం సేకరించుకొని కడుపునిండా పుష్టిగా తినేది.

ఇదంతా గమనిస్తున్న కాకి ఒకరోజు గ్రద్ద దగ్గరికి వెళ్లి 'పక్షి రాజా పక్షిరాజా నాకు ఆహారం దొరకక ఈమధ్య బాగా పస్తులు ఉంటున్నాను. నువ్వు ఆహారం సేకరించడానికి వెళ్లేటప్పుడు నన్ను కూడా తీసుకెళ్తావా' అని అడిగింది. అది విన్న గ్రద్ద ఆలోచనలో పడగా, వెంటనే కాకి 'నీ పైకి ఎగరగల ఏకైక పక్షిని నేను మాత్రమే పక్షి రాజా. దయచేసి ఈ ఒక్క సహాయం చేయవా' అంది ఎంతో దీనంగా.


జాలిపడిన గ్రద్ద 'అలాగే మిత్రమా.. రేపు ఆహారం కోసం నేను బయలుదేరుతాను. నాతో పాటు నువ్వు కూడా రా' అంది. మర్నాడు ఉదయం కాకి, గ్రద్ద కలిసి ఆకాశంలో ఎగురుతూ ప్రయాణిస్తున్నాయి. కొంత దూరం వెళ్లిన తర్వాత కాకి దుర్బుద్ధితో గ్రద్దను ఎలాగైనా కింద పడేయాలనుకుని ఒక్క ఉదుటున గ్రద్ద పైన దూకింది. కళ్ళల్లో పొడుస్తూ గోర్లతో రక్కుతూ చెవిలో గట్టిగా అరుస్తూ గ్రద్దను పైకి ఎగరకుండా కింద పడేయడానికి విశ్వ ప్రయత్నం చేసింది. కాకి దుర్బుద్ధిని గమనించిన గ్రద్ద కాకిని ఏ మాత్రం పట్టించుకోకుండా కాకితో పోరాడకుండా మౌనంగా పైపైకి ఎగురుతూ మరింత ఎత్తుకు ఎగిరింది. అంత ఎత్తులో అక్కడ ఆమ్లజనకము తగ్గిపోవడంతో కాకి శ్వాస తీసుకోలేక కింద పడిపోయింది. తన ఉపాయం పారలేదని ఏడుస్తూ, అడవికి చేరుకొంది. ఆ సంఘటనతో కాకికి బాగా బుద్ధి వచ్చింది. 'ఇతరులకి సమస్యలు సృష్టిస్తూ అడ్డుపడడం ఎంత పెద్ద తప్పో' దానికి అర్థమైంది. ఇలాంటి తప్పులు ఇంకెప్పుడు చేయకూడదు అనుకుంటూ లెంపలేసుకుంది.

నీతి : కాకులాంటి వారితో పోరాడకపోవడమే మంచిది.

- నెల్లుట్ల సునీత,
79894 60657.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే ఆంగ్లంలో వాటి పేర్లూ ఇచ్చాం. అయితే ఆ పదాల్లో కొన్ని అక్షరాలను ఇవ్వలేదు. సరైన అర్థం వచ్చేలా ఆ అక్షరాలను మీరు రాయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





సిహెచ్.నిత్యమాలిని
7వ తరగతి, ఎంపియుసి స్కూల్,
పి.నైనవరం, ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'ఆ' పిల్లల సంతోషం కోసం..



పిల్లలు చిన్న చిన్న సంతోషాలకే తెగ ఆనందపడిపోతారు. అయితే ఆ సంతోషాలు కూడా అందనంత దూరంలో చాలామంది పిల్లలు ఉంటారు. అలాంటి వారే బిషర్, అప్పుజ్. 90 శాతం వైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైన ఈ చిన్నారులు ఇంటి గోడల మధ్యే జీవించాల్సిన దుస్థితి. బయటి ప్రపంచ ఊసు కూడా ఈ పిల్లలకి తెలియదు. అలాంటిది వీరు ఇటీవల సముద్రమట్టానికి 2500 మీటర్ల ఎత్తులో గల కొండశిఖరం ఎక్కారు. కేరళ మీనంగడి దగ్గర్లోని క్రిష్ణగిరి అది. ఆ క్షణం ఆ పిల్లలు పొందిన ఆనందం మాటల్లో వర్ణించలేం.

ఆకుపచ్చ తివాచీ కప్పుకున్నట్లు కనిపిస్తున్న సముద్రం, బొమ్మల్లా నడుస్తున్న బస్సులు, కార్లు.. అగ్గిపెట్టెల్లా ఉన్న ఎత్తైన భవంతులు, తలపై నుండి చేతికి అందేంత దూరంలో కదులుతున్న మేఘాలు, చెంపలపై చల్లగా తగులుతున్న గాలి ఇచ్చిన సంతోషం ఆ పిల్లలని ఉక్కిరిబిక్కిరి చేసింది. పిల్లలకి ఇంతటి సంతోషాన్ని ఇచ్చింది మూడు స్వచ్ఛందసంస్థలు.. 'ఇదం ట్రావెల్ కలెక్టవ్', 'సమగ్ర శిక్షా కేరళ(ఎస్ఎస్‌కె)', 'జిల్లా టూరిజం ప్రమోషన్ కౌన్సిల్(డిటిపిసి) వయనాడ్' ఆ పిల్లలు, వాళ్ల కుటుంబాలు కలలో కూడా ఊహించలేని సంతోషాన్ని అందించాయి.

ట్రెక్కింగ్‌లు తరచూ నిర్వహించడం 'ఇదం' సంస్థ విధిగా చేస్తుంది. అనాథలు, వృద్ధుల కోసం వాటిని నిర్వహిస్తుంది. అయితే ఈసారి ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఏర్పాటుచేసింది. అందులో భాగంగా ముందుగా జిల్లా కేంద్రంలో పేర్లు నమోదుచేసుకున్న ఈ బాలలు ఈ అద్భుతాన్ని సాధించారు.

శిఖరం ఎక్కిన బిషర్ కళ్లల్లో ఆనందం చూసిన తన తల్లి సిరాజున్నీసా ఆనందానికి అవధులు లేవు. ఆ సంతోషాన్ని ఆమె ఇలా చెప్పారు. 'నేనెప్పుడూ నా బిడ్డ ఇంత ఎత్తు ఎక్కుతాడని ఊహించలేదు. ఇక్కడంతా రాళ్లు, రప్పలు ఉన్నాయి. ఇక్కడితో ఆగిపోదామని చాలాసార్లు అనుకున్నాం. కానీ వాలంటీర్లు నా బిడ్డని ఎత్తుకుని మరీ పైకి తీసుకెళ్లారు. వీల్‌ఛైర్ నుండి బయటికి వచ్చి వాడు అలా వాళ్ల భుజాలపై వెళుతుంటే నాకు సంతోషంతో కన్నీళ్లు వచ్చాయి' అని చెబుతున్న ఆమె, కొడుకు పొందిన ఆనందాన్ని కూడా చెప్పారు. 'వాడు ఆ సంతోషాన్ని ఇంకా అనుభవిస్తున్నాడు. ట్రిప్ ముగించుకుని ఇంటికి వచ్చిన మరుసటి రోజు కూడా నవ్వుకుంటూ కూర్చొన్నాడు. 'ఎందుకు నవ్వుతున్నావు?' అని అడిగితే.. 'అమ్మ.. నాకింకా పర్వతం ఎక్కిన క్షణాలు కళ్లముందే మెదులుతున్నాయి. ఆ సంతోషాన్ని నా గుండె మళ్లీ మళ్లీ గుర్తుచేసుకుంటూనే ఉంది' అని చెప్పాడు" అంటున్న ఆమె, మొదట కొండని చూసి చాలా భయపడినట్లు చెప్పారు. రాళ్లగుట్టల్లో వీల్‌ఛైర్ ముందుకు కదలక మొరాయించిన ప్రతిసారీ వెనక్కి వెళ్లిపోదామని నిర్ణయించుకున్నారు. అదే మాట బిషర్‌తో చెప్పినప్పుడు.. తను 'ససేమిరా' అన్నట్లు గుర్తుచేసుకున్నారు. 'ఇప్పుడు వద్దు.. మరోసారి వెళదాం' అనేదాన్ని. అయితే వాడు మాత్రం 'అమ్మా అటు చూడు.. వాళ్లు వెళుతున్నారు. మనం ఇప్పటికి చాలా ప్రయత్నించాం. ఇంకొంచెం కష్టపడదాం. శిఖరం అంచున ఈ ప్రపంచాన్ని చూడాలని నాకు కోరికగా ఉంది' అని చెప్పాడు' అంటున్న ఆమె బిడ్డ ఆనందం కోసం కష్టతరమైన ఈ ప్రయాణం కొనసాగించారు.



అప్పుజ్ తల్లి స్వప్న కూడా తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. 'అప్పు సెరబ్రల్ పాలసీతో బాధపడుతున్నాడు. ఈ అద్భుతమైన రోజు వాడి జీవితంలో వస్తుందని నేను అసలు అనుకోలేదు. నా కొడుక్కి ఇంత సంతోషాన్ని కలిగించిన వాలంటీర్లకి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా సరిపోవు' అంటున్నారు.

సంస్థ కార్యదర్శి అగస్త్యన్ ఈ కార్యక్రమం గురించి ఇలా వివరించారు. 'మేము ప్రతిసారీ చేసే ట్రిప్పులకంటే ఇది చాలా భిన్నమైంది. మొత్తం 13 మంది వైకల్యబాధిత పిల్లలను ఈ ట్రిప్‌లో భాగం చేశాం. వాళ్ల జీవితంలో అసాధ్యం అనుకున్న వాటిలో ఒక్కటైనా సాధించేలా చేయాలనుకున్నాం. ఈ ప్రయాణం ఆ పిల్లల తల్లిదండ్రులకి కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. పిల్లలని తీసుకుని ఎక్కడకైనా వెళ్లొచ్చు అన్న భరోసా వాళ్లల్లో కలిగిస్తుంది. అప్పుడే ఆ పిల్లలు కూడా అందరి పిల్లల్లాగానే సంతోషంగా ఉంటారు. అదే మా లక్ష్యం' అంటున్నారు.

ఆహారంలో ఇవి భాగం చేసుకోవాలి



ఇంట్లో, ఆఫీసుల్లో ఎడతెగని పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళలు క్రమం తప్పకుండా అవసరమైన విటమిన్లు లభించే పోషకాహారం తీసుకోవాలి. హిమోగ్లోబిన్ ఏర్పడటానికి ఐరన్, ఎముకల నిర్మాణానికి కాల్షియం, రోగనిరోధక శక్తికి జింక్ మొదలైనవి శరీరానికి చాలా అవసరం.

'బి' విటమిన్లు : వయస్సు పైబడుతున్న మహిళలకు రోగనిరోధక శక్తి తగ్గుతూ వుంటుంది. కాబట్టి వీళ్లు బి విటమిన్లు అధికంగా లభించే ముదురు ఆకుపచ్చ ఆకుకూరలు, కూరగాయలు, పాలు, చేపలను తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలి.

అయోడిన్ : అయోడిన్ అధికంగా ఉండే దానిమ్మ, పెరుగు, స్ట్రాబెర్రీ, బంగాళదుంప వంటివి తినాలి. చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం ద్వారా కూడా అయోడిన్‌ను పొందవచ్చు. నీళ్లు ఎక్కువగా తాగాలి. థైరాయిడ్ సమస్య ఉన్నట్లయితే.. తప్పకుండా వైద్యులు, ఆహార నిపుణులు సూచించే ఆహారాన్ని మాత్రమే డైట్‌గా తీసుకోవాలి.

ఫోలేట్ : దీన్ని ఫోలిక్ యాసిడ్ అని కూడా అంటారు. కణాల అభివృద్ధికి, డిఎన్ఎ, ఆర్ఎన్ఎ, ఏర్పడటానికి ఫోలేట్ అవసరం అవుతుంది. 25 ఏళ్లు పైబడిన వారు సిట్రస్ పండ్లు, కిడ్నీ బీన్స్, గుడ్లు వంటి ఆహారాలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

కాల్షియం, విటమిన్ డి : వృద్ధాప్యంలో ఎముకల క్షీణత సాధారణం. అందుకే 40 ఏళ్లు పైబడిన మహిళలు ఎముకల్లో పగుళ్లు, గాయాల బారిన పడకుండా ఉండాలంటే.. రోజూ 1200 మి.గ్రా. కాల్షియం, 600 మి.గ్రా. డి విటమిన్ అవసరం అవుతుంది. పాలు, గుడ్డులో పుష్కలంగా ఇవి లభిస్తాయి. ఎముకల బలానికి, కండరాలు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి కాల్షియం అవసరం. యుక్త వయస్సులోని ఆడపిల్లలకు ఎముక సాంద్రత పెరగాలంటే, కాల్షియం లభించే ఆహార పదార్థాలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటే ఎముకల అభివృద్ధిలో లోపాలు ఏర్పడతాయి. పాల ఉత్పత్తులు, సోయా, చేపలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. సీ ఫుడ్, పప్పులు, తృణధాన్యాలైన రాగులు, గోధుమ, జొన్నల్లో విటమిన్ డి ఉంటుంది.

ఐరన్ : చాలామంది మహిళలు ఐరన్ లోపంతో బాధపడుతుంటారు. సాధారణంగా మహిళలకి రోజుకు 18 మి.గ్రా ఐరన్ అందాలి. మాంసం, చేపలు, బచ్చలికూర, గుమ్మడి గింజలు, దానిమ్మలో ఇది పుష్కలంగా ఉంటుంది.



'గ్లోబల్ ట్రాటర్' కొత్త అప్‌డేట్స్

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి డైరెక్షన్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రియాంక చోప్రా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'ఎస్ఎస్ఎంబి29' వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ చేస్తున్న ఈ సినిమా టైటిల్ ఈ రోజు(శనివారం) రిలీజ్ చేయబోతున్నారు. ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్‌లో భారీ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. అందుకు సంబంధించిన పాస్‌లు కూడా ఫ్యాన్స్‌కు మేకర్స్ అందజేశారు. ఇక సినిమా విశేషాలకి వస్తే.. ఈ సినిమాకు 'వారణాసి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసారని వార్తలు వస్తున్నాయి. ఈరోజు జరగబోయే ఈవెంట్‌లో ఈ విషయాన్ని ప్రకటించనున్నారు. టైటిల్ పోస్టర్ తో పాటు గ్లిమ్స్ కూడా రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సినిమా రిలీజ్ డేట్‌పై కూడా అప్‌డేట్ వినిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సినిమాను 2027 మార్చి 25న రిలీజ్ చేయబోతున్నారు. ఈ ఈవెంట్ జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.

బాలీవుడ్ నటి కామినీ కౌశల్ మృతి



బాలీవుడ్ నటి కామినీ కౌశల్(98) శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. హిందీ చిత్రసీమలో దాదాపు ఏడు దశాబ్దాల పాటు నటిగా తనదైన ముద్ర వేసిన ఆమె 1946 నుండి 1963 వరకూ కథానాయికగా రాణించారు. ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొనసాగారు. చివరగా కామినీ కౌశల్, షాహీద్ కపూర్ 'కబీర్ సింగ్'లో నటించారు. తెలుగు 'అర్జున్ రెడ్డి'లో కాంచన పోషించిన హీరో నానమ్మ పాత్రను హిందీలో ఆమె చేశారు. ఆ తర్వాత ఆమీర్ ఖాన్ 'లాల్ సింగ్ చద్దా'లో గెస్ట్ అప్పీయరెన్స్ ఇచ్చారు. కెరీర్ ప్రారంభం నుండే ఆమె అనేక అవార్డులను అందుకున్నారు. ఆమె మృతికి పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు.

రూ.10కే ఓటీటీలో సినిమాలు



ప్రస్తుతం పలు ఓటీటీ సంస్థలు ప్రేక్షకులను అలరించటానికి అనేక సినిమాలు, వెబ్‌సిరీస్, ఇతర కార్యక్రమాలను ప్రసారం చేస్తూ దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా భారతీయ ఓటీటీ రంగంలోకి 'టీబీడీ' (త్రిభాణధారి) ఓటీటీ అడుగుపెట్టింది. దుబాయ్ కేంద్రంగా నడుస్తున్న రాయల్ ర్యాప్చీ సంస్థ దీన్ని నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఇటీవలే దుబాయ్‌లో ప్రారంభించిన 'టీబీడీ' ఓటీటీ ఇప్పుడు మనదేశంలోనూ ప్రసారాలను ఇచ్చేందుకు సిద్ధమైంది. యాప్ ప్రారంభానికి ఆ సంస్థ ఫౌండర్, ఎండి ధరమ్ గుప్తా, సీఈఓ సునీల్ భోజ్వానీ, సౌత్ ఇండియా సీఈఓలు నటులు, నిర్మాత డిఎస్ రావు, దర్శకుడు వి. సముద్రలతో పాటు దర్శకులు విఎన్ ఆదిత్య, చంద్రమహేష్, ఇ.సత్తిబాబు, శివనాగు, డిజిక్వెస్ట్ అధినేత బసిరెడ్డి, 'సంతోషం' అధినేత సురేష్ కొండేటి, నటుడు దాసన్నతో పాటు పలువురు నిర్మాతలు, చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. నిర్మాత కె.కె. రాధామోహన్ యాప్‌ను ఆవిష్కరించారు. ధరమ్‌గుప్తా మాట్లాడుతూ 'మన దేశీయమైన వల్గారిటీలేని కంటెంట్ మాత్రమే ఉంటుంది. ఈ ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ కేవలం రూ.10 మాత్రమే' అని అన్నారు.



'రివాల్వర్ రీటా' ట్రైలర్ విడుదల

విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. కె.చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. కీర్తి సురేష్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుందనేది ట్రైలర్‌ను బట్టి తెలుస్తుంది.

సత్య హీరోగా 'జెట్లీ'



'మత్తు వదలరా', 'హ్యాపి బర్త్‌డే', 'మత్తు వదలరా 2' చిత్రాలని తెరకెక్కించిన రితేష్ రానా తన కొత్త సినిమాను ప్రకటించారు. కమెడియన్ సత్య ఈ సినిమాలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాను క్లాప్ ఎంటర్‌టైనమెంట్ బ్యానర్ నిర్మిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'జెట్లీ' అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సత్య ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు. సత్య సరసన రియా సింఘా కథానాయికగా నటించబోతుండగా వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటించబోతున్నారు. ఈ సినిమాకు కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.

సఫారీ ధమాల్

● తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్ ● ఐదు వికెట్లతో బుమ్రా బూమ్ బూమ్
● భారత్ తొలి ఇన్నింగ్స్ 37/1 ● ఈడెన్ గార్డెన్స్ టెస్టు తొలి రోజు



కోల్‌కతా : భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా (5/27) ఐదు వికెట్లతో చెలరేగాడు. అద్భుత నైపుణ్యం, అసమాన వైవిధ్యంతో బంతులేసిన జస్‌ప్రీత్ బుమ్రా.. సఫారీ బ్యాటర్లను వణికించాడు. బుమ్రాకు తోడు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/36), మహ్మద్ సిరాజ్ (2/47) రాణించటంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (31, 48 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), వియాన్ ముల్డర్ (24, 51 బంతుల్లో 3 ఫోర్లు), టోనీ (24, 55 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) సఫారీ తరఫున టాప్ స్కోరర్లుగా నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లు బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది. మూడో సెషన్లో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో 37/1తో ఆడుతోంది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (13 నాటౌట్, 59 బంతుల్లో 2 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (6 నాటౌట్, 38 బంతుల్లో) అజేయంగా ఆడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇంకో 122 పరుగుల వెనుకంజలో నిలిచింది.

ఓపెనర్లు మెరిసినా..

టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ల జోరుతో సఫారీ నిర్ణయం సముచితమే అనిపించింది. ఎడెన్ మార్‌క్రామ్ (31), రియాన్ రికెల్టన్ (23)లు తొలి వికెట్‌కు 57 పరుగులతో శుభారంభం అందించారు. ఓపెనర్లు దూకుడుగా రాణించటంతో తొలి పది ఓవర్లలోనే దక్షిణాఫ్రికా 57 పరుగులు పిండుకుంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే సంకేతాలతో సఫారీలు భారీ స్కోరు చేయగలదనే అంచనాలకు ఊతం లభించింది. కానీ వరుస ఓవర్లలో ఓపెనర్లను అవుట్ చేసిన బుమ్రా.. దక్షిణాఫ్రికాకు కోలుకోలేని షాక్ ఇచ్చాడు. మరోవైపు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ మ్యాజిక్‌తో సఫారీ వేగంగా వికెట్లు కోల్పోయింది. మిడిల్ ఆర్డర్‌లో నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన వియాన్ ముల్డర్ (24), టోనీ (24)లను కుల్‌దీప్, బుమ్రాలు సాగనంపారు. కెప్టెన్ తెంబ బవుమా (3) కుల్‌దీప్ ఓవర్లో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. అప్పటికి సఫారీలు 32.3 ఓవర్లలో 120 పరుగులకు ఐదు వికెట్లు నష్టోయింది. తొలి రెండు స్పెల్స్‌లో లయ అందుకోని మహ్మద్ సిరాజ్‌కు మరోసారి బంతి ఇచ్చిన శుభ్‌మన్ గిల్.. మరో బ్రేక్ సాధించాడు. ఒకే ఓవర్లో కైల్ వెరెనె (16), మార్కో జాన్సెన్ (0) వికెట్లతో సిరాజ్ వికెట్ల వేటలో భాగమయ్యాడు. టీ విరామం తర్వాత ఒకే ఓవర్లో హార్మర్ (5), కేశవ్ మహరాజ్ (0) వికెట్లతో బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేయగా.. దక్షిణాఫ్రికా పతనం పరిపూర్ణమైంది.

జైస్వాల్ అవుట్..

తొలి రోజు ఆఖర్లో 20 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (12) వికెట్‌ను కోల్పోయింది. మూడు ఫోర్లతో మెరిసిన యశస్వి జైస్వాల్.. జాన్సెన్ ఓవర్లో కట్ షాట్‌కు ప్రయత్నించి వికెట్ కోల్పోయాడు. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ (13 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (6 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 37/1తో ఆడుతోంది. తొలి టెస్టు తుది జట్టులో భారత్ విప్లవాత్మక మార్పులు చేసింది. మూడో స్పిన్ ఆల్‌రౌండర్ లేదా స్పెషలిస్ట్ స్పిన్నర్ కోసం పోటీ నెలకొనగా.. గిల్, గంభీర్ మూడో స్పిన్ ఆల్‌రౌండర్, స్పెషలిస్ట్ స్పిన్నర్ ఇద్దరినీ జట్టులోకి తీసుకున్నారు. టాప్ ఆర్డర్‌లో నెం.3 బ్యాటర్‌గా వాషింగ్టన్ సుందర్ జట్టులోకి వచ్చాడు. దీంతో కోలకతా టెస్టులో భారత్ నలుగురు స్పిన్నర్లతో ఆడుతోంది.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : ఎడెన్ మార్‌క్రామ్ (సి) పంత్ (బి) బుమ్రా 31, రియాన్ రికెల్టన్ (బి) బుమ్రా 23, వియాన్ ముల్డర్ (ఎల్బీ) కుల్‌దీప్ 24, తెంబ బవుమా (సి) జురెల్ (బి) కుల్‌దీప్ 3, టోనీ (ఎల్బీ) బుమ్రా 24, ట్రిస్టన్ స్టబ్స్ నాటౌట్ 15, కైల్ వెరెనె (ఎల్బీ) సిరాజ్ 16, మార్కో జాన్సెన్ (బి) సిరాజ్ 0, కార్బిన్ బాచ్ (ఎల్బీ) అక్షర్ 3, హార్మర్ (బి) బుమ్రా 5, కేశవ్ మహరాజ్ (ఎల్బీ) బుమ్రా 0, **ఎక్స్‌ట్రాలు :** 15, **మొత్తం :** (55 ఓవర్లలో ఆలౌట్) 159.

వికెట్ల పతనం : 1-57, 2-62, 3-71, 4-114, 5-120, 6-146, 7-147, 8-154, 9-159, 1-159.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 14-5-27-5, మహ్మద్ సిరాజ్ 12-0-47-2, అక్షర్ పటేల్ 6-2-21-1, కుల్‌దీప్ యాదవ్ 14-1-36-2, రవీంద్ర జడేజా 8-2-13-0, వాషింగ్టన్ సుందర్ 1-0-3-0.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) జాన్సెన్ 12, కెఎల్ రాహుల్ బ్యాటింగ్ 13, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్ 6, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (20 ఓవర్లలో ఓ వికెట్‌కు) 37.

వికెట్ల పతనం : 1-18.

బౌలింగ్ : మార్కో జాన్సెన్ 6-2-11-1, వియాన్ ముల్డర్ 5-1-15-0, కేశవ్ మహరాజ్ 5-1-8-0, కార్బిన్ బాచ్ 3-2-1-0, హార్మర్ 1-1-0-0

32 బంతుల్లోనే వైభవ్ సెంచరీ

ఇండియా-ఎ ఘన విజయం



దోహ : ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025లో భాగంగా యుఎఇతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా-ఎ నాలుగు వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేసింది. యుఎఇ 149/7కు పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (144, 42 బంతుల్లో 11 ఫోర్లు, 15 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించాడు. 17 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఈ 14 ఏళ్ల కుర్రాడు మరో 15 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

వైభవ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. ఆయాన్ ఖాన్ వేసిన మూడో ఓవర్‌లో వరుసగా 4, 6, 6 బాదేసిన ఈ కుర్రాడు.. తర్వాత జవదుల్లా బౌలింగ్‌లో మూడు ఫోర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. రోహిద్ ఖాన్ వేసిన ఆరో ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి.. 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. అనంతరం ఫరాజుద్దీన్ బౌలింగ్‌లో వరుసగా 4, 6, 4 కొట్టాడు. ఫరాజుద్దీన్ తర్వాతి ఓవర్‌లో వైభవ్ హ్యాట్రిక్ సిక్స్‌లు బాదేసి 98 పరుగులకు చేరుకున్నాడు. ముహ్మద్ అర్ఫాన్ వేసిన పదో ఓవర్‌లో ఫోర్ బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం తర్వాత కూడా అతని జోరు తగ్గలేదు. హర్షిత్ కౌశిక్ బౌలింగ్‌లో వరుసగా నాలుగు సిక్సర్లు, ఓ ఫోర్‌తో చెలరేగాడు. తర్వాత రెండు సిక్స్‌లు కొట్టి చివరకు ఫరాజుద్దీన్ బౌలింగ్‌లో (12.3 ఓవర్) అవుటయ్యాడు.

ప్రపంచ రికార్డు

ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ ఓ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 35 కంటే తక్కువ బంతుల్లో రెండుసార్లు సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఐపిఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్న ఇతను గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో శతకం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు టి-20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు.

టి-20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీలు చేసిన భారత

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68